RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 55 ISSUE NO : 55 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | గురువారం , ఆగస్టు, 14, 2025 Thursday, August, 14, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



నిన్న అసీం మునీర్.. నేడు పాక్ ప్రధాని..

## భారత్‌కు తీవ్ర హెచ్చరిక

- భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్

ఢిల్లీ,: సింధు నదీ జలాల విషయంలో భారత్, పాకిస్థాన్ మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. తమ దేశానికి చెందిన ఒక్క నీటి చుక్కను కూడా శత్రువులు లాక్కోలేరని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తాజాగా భారత్‌ను ఉద్దేశించి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇస్లామాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, "మా నీటిని అడ్డుకుంటామని బెదిరిస్తే, ఒక్క చుక్కను కూడా మీరు తీసుకోలేరని గుర్తుంచుకోండి. అలాంటి ప్రయత్నం చేస్తే గట్టి గుణపాఠం చెబుతాం" అని వ్యాఖ్యానించారు. పహల్గామ్‌లో 26 మంది పౌరుల మృతికి కారణమైన ఉగ్రదాడి జరిగిన మరుసటి రోజైన ఏప్రిల్ 23న, 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. నీటి ప్రవాహాన్ని అడ్డుకునే ఏ ప్రయత్నాన్నైనా యుద్ధ చర్యగా పరిగణిస్తామని పాకిస్థాన్ పలుమార్లు స్పష్టం చేసింది.

ఢిల్లీ,: ప్రభుత్వ ఉద్యోగాల్లో అమలవుతున్న రిజర్వేషన్ల విధానంలో కీలక మార్పులు కోరుతూ దాఖలైన ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. రిజర్వేషన్ల ప్రయోజనాలు ఆయా వర్గాల్లోని అత్యంత నిరుపేదలకు మాత్రమే అందేలా ఆర్థిక ప్రాతిపదికను చేర్చాలని ఈ పిటిషన్‌లో కోరారు. ఈ వ్యాజ్యంపై స్పందించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం నిన్నఈ పిల్‌ను విచారణకు స్వీకరించింది.



ఎస్సీ, ఎస్టీలకు ఆదాయ ఆధారిత రిజర్వేషన్లు..

## పిల్ విచారణకు సుప్రీంకోర్టు ఓకే

- ప్రభుత్వ ఉద్యోగ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం
- రిజర్వ్‌డ్ వర్గాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికే ప్రాధాన్యం ఇవ్వాలని పిటిషనర్ల వాదన
- పిల్‌ను విచారణకు స్వీకరించిన జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం
- ఈ పిల్‌పై తీవ్ర వ్యతిరేకత రావొచ్చని పిటిషనర్లకు కోర్టు సూచన

**అక్టోబర్ 10లోగా స్పందించాలని కేంద్రప్రభుత్వానికి నోటీసులు**



రాజస్థాన్‌లో ఘోర రోడ్డు

## ప్రమాదం

**11 మంది భక్తుల మృతి**

- ఖాటు శ్యామ్ భక్తులతో వెళ్తున్న పికప్ వాహనాన్ని ఢీకొట్టిన ట్రక్కు

జైపూర్ (రాజస్థాన్) :రాజస్థాన్‌లో బుధవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఖాటు శ్యామ్ ఆలయంలో దర్శనం ముగించుకుని తిరిగి వస్తున్న భక్తుల వాహనం ప్రమాదానికి గురవడంతో ఏడుగురు చిన్నారులతో సహా 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటన దౌసా జిల్లాలోని బాపి సమీపంలో మనోహర్‌పూర్ హైవేపై జరిగింది. వివరాల్లోకి వెళితే.. భక్తులతో ప్రయాణిస్తున్న ఒక ప్యాసింజర్ పికప్ వాహనాన్ని ఎదురుగా వస్తున్న ట్రక్కు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు పికప్ వాహనం నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి.



కష్టకాలంలో ప్రజలకు

## అండగా నిలవాలి

**ఆ మూడు జిల్లాల పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపు**

హైదరాబాద్ ,తెలంగాణ దిశ : రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అనేక ప్రాంతాలు జలమయమై, లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ ఈ విపత్కర పరిస్థితుల్లో బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు వర్ష బాధితు లకు అండగా నిలవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండి, ప్రజలకు అండగా నిలవాలన్నారు కేటీఆర్.



ఎమ్మెల్సీ కోదండరాం, అలీఖాన్ నియామకం రద్దు

## సుప్రీం సంచలన తీర్పు..

- నియామకాలపై స్టే విధించిన సుప్రీంకోర్టు
- గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియామకం
- తదుపరి ఉత్తర్వులకు అనుగుణంగా ఎంపిక ఉండాలన్న సుప్రీంకోర్టు

ఢిల్లీ: సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. గవర్నర్ కోటాలో ఎన్నికైన ఎమ్మెల్సీ కోదండరాం, అలీఖాన్ నియామకం రద్దు చేస్తూ.. సుప్రీం ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, సత్యనారాయణ పిటిషన్‌లపై విచారణ చేపట్టిన న్యాయస్థానం కోదండరాం, అలీఖాన్ నియామకం రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. రెండు ఎమ్మెల్సీ స్థానాలలో తాజా నామినేషన్లు తమ తుది తీర్పుకి లోబడే ఉంటాయని సుప్రీంకోర్టు చెప్పుకొచ్చింది. కోదండరాం, అలీఖాన్‌లు తెలంగాణ గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా నియామకం అయిన విషయం తెలిసిందే. అయితే వీరి నియామకం అక్రమంగా జరిగిందని.. దాసోజు శ్రవణ్, సత్యనారాయణలు గవర్నర్‌కు తెలిపారు.



రాఖీ పౌర్ణమి సందర్భంగా

## ఆర్టీసీలో రద్దీ..

అందులో 2.51 కోట్ల ఉచిత ప్రయాణాలు సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ వెల్లడి

హైదరాబాద్,తెలంగాణ దిశ : రాఖీ పౌర్ణమి సందర్భంగా తెలంగాణ ఆర్టీసీ బస్సులను మహిళలు పెద్ద ఎత్తున వినియోగించుకున్నారని.. ఆరు రోజుల్లో మొత్తం 3.68 కోట్ల మంది రాకపోకలు సాగించగా.. అందులో 2.51 కోట్ల ఉచిత ప్రయాణాలు ఉన్నాయని సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు.

ఈ నెల 9న రాఖీ పండుగ రోజున 45.62 లక్షల మంది మహిళలు ప్రయాణించగా.. ఈ నెల 11న అత్యధికంగా 45.94 లక్షల మంది రాకపోకలు సాగించారని పేర్కొన్నారు. ఒక్కరోజులో ఇంతమంది మహిళలు ప్రయాణించడం

ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. గత ఏడాది రాఖీకి 2.75 కోట్ల ప్రయాణికులను గమ్యస్థానాలకు చేసిందని, ఈ ఏడాది 3.68 కోట్ల మంది రాకపోకలు సాగించారన్నారు. గతేడాదితో పోలిస్తే 92.95 లక్షల మంది ఎక్కువగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారని.. ఈ ఏడాది 2.28 కోట్ల కిలోమీటర్లు ఆర్టీసీ బస్సులు తిరిగాయన్నారు.




సవరణలా..? చేర్పులా..?

## స్పష్టత ఇవ్వని ఇసీ

- కొత్తగా 64 వేల దరఖాస్తులు
- అయోమయంగా 'ఎస్ఐఆర్'

న్యూఢిల్లీ : బీహార్ కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో రోజుకో వివాదం తెరమీదకు వస్తోంది. ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ అయోమయంగా సాగుతోంది. సవరణల కోసమని చేపట్టిన ఈ ప్రక్రియలో వాటితో పాటు కొత్త చేర్పులు కూడా భారీగా చోటుచేసుకోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. మొదటి సారి ఓటు నమోదు కోసం ఏకంగా 64 వేల మంది దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. ఎన్నికల సంఘం వెల్లడించిన తాజా ముసాయిదా అనంతరం 10 రోజుల్లో అంటే మంగళవారం నాటికి కొత్తగా ఓట్ల నమోదు కోసం 63,571 మంది దరఖాస్తు చేసుకున్నారని ఇసి తెలిపింది. అయితే కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారిలో ముసాయిదా జాబితాలో పేరు లేని వారు ఎంత మంది ఉన్నారు..



## మంచిర్యాల జిల్లాలో గర్భిణికి.. సీత కష్టం

**తాండూర్,తెలంగాణ దిశ :** గత కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కొడుతున్న వర్షాల వల్ల మం చిర్యాల జిల్లాలోని తాండూర్ మండలంలో గల నరసాపూర్ సమీపానగల వాగు ఉప్పొంగి పారుతుండడంతో ఒక గర్భిణి పడిన కష్టం సీత కష్టమని చెప్పక తప్పదు. వివరాలు ఇలా ఉన్నాయి. మంచిర్యాల జిల్లాలోని తాండూర్ మండలం లోని నర్సాపూర్ గిరిజన గ్రామానికి చెందిన గర్భిణి యమునకు బుధవారం ఉదయం పురిటి నొప్పు వచ్చాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు మండలంలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షంతో కురిసింది. దీంతో నరసాపూర్ సమీపంలోని వాగు ఉప్పొంగి వరదనీరు ఉధృతంగా ప్రవహించింది. గర్భిణీ కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా వాగులోని వరద ఉధృతికి ఇబ్బందులు పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న తాండూర్, మాదారం ఎస్సైలు కిరణ్ కుమార్, సౌజన్య,కాంగ్రెస్ నాయకులు సూరం రవీందర్ రెడ్డి,పోలీస్ సిబ్బందితో వాగు వద్దకు చేరుకున్నారు. వాగు ఉధృతి కారణంగా గర్భిణిని పోలీసులు స్థానికుల సహాయంతో తాడుతో వాగు అవతలికి దాటించారు. అనంతరం ఆమెను 108 అంబులెన్స్ లో బెల్లంపల్లి ఆసుపత్రికి తరలించారు.



తెలంగాణ పట్ల కేంద్రం

## వివక్ష

అధునాతన ప్యాకేజీ కంపెనీకి దక్కని అనుమతి కేంద్రం తీరుపై మంత్రి శ్రీధర్ బాబు అసహనం

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణకు వచ్చే కంపెనీలకు అనుమతి ఇచ్చే విషయంలో కేంద్రం వివక్ష చూపుతోందని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. బుధవారం మంత్రి మాట్లాడుతూ.. ఏపీకి కొత్త ప్రాజెక్టులు కేటాయించి, తెలంగాణను మాత్రం పక్కన పెడుతోందన్నారు.

# విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

## - వరంగల్ డిఐఈఓ డాక్టర్ శ్రీధర్ సుమన్




**వరంగల్, ఆగస్టు 13, (తెలంగాణ దిశ)** :స్థానిక ఏవివి మాల్ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కోడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నేడు మత్తు పదార్థాల వ్యతిరేకంగా "నష ముక్త్ భారత్" కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ సుమన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు, ఇతర వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో, పట్టుదలతో లక్ష్యం సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. అలాగే కళాశాల ప్రిన్సిపాల్ భూజేందర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి కోడి మాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏవివి కళాశాల విద్యార్థులు అన్ని రంగాలలో ముందుంటారని అన్నారు. ముఖ్యంగా సామాజిక రుగ్మతలపై ప్రజలకు చైతన్య, అవగాహన కార్యక్రమాలు కలిగిస్తారని అన్నారు. ఈ "నష ముక్తు భారత్ "లో మా విద్యార్థులు పాల్గొని పరిసర ప్రాంతాల వారికి కూడా మత్తు పదార్థాల యొక్క అనర్థాలను వివరించడం అభినందనీయం అన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు అమ్మినచో కలిగినచో వారి యొక్క సమాచారాన్ని స్థానిక అధికారులకు తెలియజేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం డ్రగ్ వ్యతిరేక పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎస్. అనిత, సంజీవ, డాక్టర్ శ్రీధర్, స్వప్న, డాక్టర్ బి. గోపి, విద్యార్థులు సన, సహిస్తా, దేవిశ్రీ ప్రసాద్, సాకేత్, నవ్య, రాజకుమార్, చిరంజీవి, దస్తగిరి, సాత్విక్, సాకేత్ తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది

## - జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా






**మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 13, (తెలంగాణ దిశ)** :ఆరోగ్యానికి హానికరమైన మాదక ద్రవ్యాలను నిరోధించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా పిలుపు నిచ్చారు. నషా ముక్త భారత్ అభియాన్ లో భాగంగా బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జెఎల్‌బి హరిప్రియ, కలెక్టరేట్ పరిపాలన అధికారి రాంమోహన్, జిల్లా సంక్షేమ అధికారి శారద, కమ్యూనిటీ ఎడ్యుకేటర్ విజయ, వివిధ శాఖ సిబ్బందితో కలిసి మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా రాధికా గుప్తా మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా యువత కృషి చేయాలని సూచించారు. మాదక ద్రవ్యాల నివారణపై జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. డ్రగ్స్ తీసుకునే వారితోపాటు అక్రమ రవాణ చేసే వారి గురించి తెలిసిన సమాచారాన్ని 1908 టోల్ ఫ్రీ నెంబర్ కు తెలియజేయాలని సూచించారు.

# తప్పుడు పత్రాలతో డబల్ బెడ్ రూమ్ పొందిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 13, (తెలంగాణ దిశ)** :తప్పుడు పత్రాలతో నిజాంపేట కార్పొరేషన్ బాచుపల్లి డబల్ బెడ్ రూమ్ పొందిన వ్యక్తి పై చర్యలు తీసుకోవాలని ఆకుల సతీష్ బుధవారం బాచుపల్లి మండల రెవెన్యూ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సదరు వ్యక్తి మున్సిపల్ కార్పొరేషన్ లోని నాలుగవ డివిజన్ అధ్యక్షుడుగా ఉన్న ఒక వాట్సాప్ గ్రూపులో ఒక మతం వారు 20 శాతం మాత్రమే ఉన్నారని మేము 80 శాతం ఉన్నాం. తక్కువ శాతం ఉన్న వర్గంపై అంతు చూస్తాం. 15వ ఆగస్టు జండా కూడా ఎగరవేయనీయం అంటూ బెదిరించి మతాలపరంగా చిచ్చు లేపాలని చూస్తున్నాడని ఆకుల సతీష్ తన ఫిర్యాదులో రెవెన్యూ అధికారులకు వివరించారు. ఆ వ్యక్తి తప్పుడు కుల ధ్రువీకరణ పత్రంతో డబల్ బెడ్ రూమ్ ఫ్లాట్ పొందారని అతని కుల ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. మతపరంగా దూషించినందుకు ఆవ్యక్తిపై బాచుపల్లి పోలీసులు కేసు కూడా నమోదు చేశారని ఆయన వివరించారు. ఎమ్మార్వో కార్యాలయంలో తాసిల్దార్ అందుబాటులో లేకపోవడంతో సీనియర్ సెక్షన్ అధికారికి ఆయన ఫిర్యాదు లెటర్ ను అందించారు. ఈ కార్యక్రమంలో అమలేశ్వరి, అరుణ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# హెల్త్ క్యాంపును ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే





**చర్లపల్లి, ఆగస్టు 13, (తెలంగాణ దిశ)** :ప్రజలందరూ హెల్త్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు.చర్లపల్లి డివిజన్ పరిధిలోని సిఐఎ హాల్ ఫేస్ 2 లో మల్టీ స్పెషాలిటీ మెగా హెల్త్ క్యాంపును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలని ఆయన సూచించారు. హెల్త్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని రెడ్డి, అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, చైర్మెన్ గోవింద్ రెడ్డి, హరీష్ రెడ్డి, జీనియా హాస్పిటల్ యాజమాన్యం, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం, మంత్రి ఆదేశాలతో అర్ధరాత్రి ప్రారంభమైన పనులు





**ఉప్పల్, ఆగస్టు 13, (తెలంగాణ దిశ)** :ఉప్పల్ లో రోడ్డు తిప్పల్ తీరనున్నాయి. ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని రోడ్డు సమస్యకు చెక్ పడనుంది. రోడ్డు నిర్మాణం, గుంతల పూడ్చి వేత పనులు మంగళవారం రాత్రి ప్రారంభమయ్యాయి. దీంతో ప్రజల ఇబ్బందులు తొలగిపోనున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో అర్ధరాత్రి పనులను కాంగ్రెస్ ఉప్పల్ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి మేడ్చల్ ఇంచార్జీ తోటకూర వజ్రేష్ యాదవ్ పరిశీలించారు. ఉప్పల్ లో ప్రధాన రహదారిపై చేపట్టిన పనులను మంగళవారం రాత్రి సంబంధిత విభాగాల అధికారులతో కలిసి పరమేశ్వర్ రెడ్డి పనులను పరిశీలించారు.

# హర్ ఘర్ తిరంగా ర్యాలీ సందర్భంగా

## - మాజీ సైనిక ఉద్యోగులకు ఘనంగా సన్మానం



**నాగారం, ఆగస్టు 13, (తెలంగాణ దిశ)** :హర్ ఘర్ తిరంగా ర్యాలీ సందర్భంగా బుధవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలో మాజీ సైనిక ఉద్యోగులను ఘనంగా సన్మానించారు.

బిజెపి నాగారం మున్సిపల్ అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో నాగారం మున్సిపల్ హరి, తిరంగా కన్వీనర్ బిజ్జు శ్రీనివాస్, నాగారం మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా పది మంది మాజీ సైనిక ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున బిజెపి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

# పద్మశాలి టౌన్ షిప్ లో వనమహోత్సవం



**ఏఎస్ రావునగర్, ఆగస్టు 13, (తెలంగాణ దిశ) :**
ఏఎస్ రావునగర్ డివిజన్‌పరిధిలోని పద్మశాలి టౌన్ షిప్ లో జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో బుధవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ శిరీష సోమ శేఖర్ రెడ్డితో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మొక్కలు నాటారు. బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమ శేఖర్ రెడ్డి, పార్టీ నాయకులు కాసం మహిపాల్ రెడ్డి, కుమార స్వామి, మనెమ్మ, బేతాళ బాలరాజు, మురళి పంతులు, రహీమ్, యాకయ్య పాల్గొన్నారు.

# కొంపల్లిలో ఆకట్టుకున్న తిరంగ ర్యాలీ






**కుత్బుల్లాపూర్, ఆగస్టు 13, (తెలంగాణ దిశ)** :ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు బుధవారం కొంపల్లిలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే కాలంలో మన పిల్లలను కమిట్ మెంట్ తో, కన్విక్షన్ తో ఈ దేశ ఎదుగుదలలో భాగం పంచుకునే గొప్ప పౌరులుగా తీర్చిదిద్దాలని ఉద్దేశంతో నరేంద్ర మోడీ హర్ ఘర్ తిరంగ అనే కార్యక్రమానికి పిలుపు నిచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యులుకావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు మల్లారెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దివాకర్, మేడ్చల్ రూరల్ జిల్లా మాజీ అధ్యక్షులు విక్రం రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరి వర్ధన్ రెడ్డి, కార్పొరేటర్ రావుల శేషగిరి, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్ రెడ్డి, కొంపల్లి మండల అధ్యక్షులు సతీష్ సాగర్, జాయింట్ కన్వీనర్ శివాజీ, సరిత, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ పల్లెల్లో అడ్రస్ లేని మిషన్ భగీరథ..

## ఇంటింటికీ నల్లా మాట ఉత్తిమాటే ..!

## చుక్కత్రాగు నీరు లేక వాగుల నీరే దిక్కు...



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 13, (తెలంగాణ దిశ)** : పేరుకే మిషన్ భగీరథ పథకం.. అధికారుల హడావుడి.. ఆదివాసీ పల్లెల్లో కానరాని ఆపరేటర్లు.. కనిపించని అధికారుల పర్యవేక్షణ ఫలితం గా కష్టబడే ఆదివాసీలే బలవుతున్నారు. అలుపెరగకుండా నిత్యం కష్ట పడుతూ జీవనాన్ని కినసాగించే ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న అధికారులు త్రాగడానికి చుక్క మంచినీరు అందించకపోవడమే గాక మిషన్ భగీరథ మంచినీరుని ఇంటింటికి పంపిణీ చేయడంలో విఫలమయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కొండవాయి గ్రామంలో ఆదివాసీ గిరిజనులకు నీటి కష్టాలు తప్పటం లేదు.. వారి దాహం తీర్చతంలో మిషన్ భగీరథ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అమాయక ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఉన్న మిషన్ భగీరథకు చెందిన ప్లాస్టిక్ వాటర్ టాంక్ పాడై పోవటంతో ఆదివాసీలు నీటి కోసం అడవిలో రెండు కిలో మీటర్లు వెళ్లి మంచినీటిని తెచ్చుకొని దాహార్తిని తీర్చుకుంటున్నారు. కొండివాయి గ్రామం తెలంగాణ, ఛత్తీస్ ఘడ్ కు సరిహద్దుల్లో ఉన్నది. ఛత్తీస్ ఘడ్ లో భారీగా వర్షాలు పడటంతో సరిహద్దుల్లో ఉన్న చెరువుల ద్వారా వస్తున్న నీరే వారికి గతయింది.. ఆ నీళ్లు తెచ్చుకోవాలన్నా రెం డు కిలో మీటర్లు వెళ్లి దాహం తీర్చుకునే దీన పరిస్థితుల్లో ఆదివాసీలున్నారు. ఒక పక్క వ్యవసాయం పనుల్లో కష్ట పడుతూ మరో పక్క నీళ్లు తెచ్చు కోవడం ఇలా నానా అవస్థలు పడుతున్న



మమ్మల్ని ఎవరూ పట్టించువడం లేదని ఆవేదన చెందుతున్నారు. కాలం ముం దుకుపోయే తరుణంలో ఈ గిరిజనుల కష్టాలు వర్ణాతీతంగా మారాయి.




# సంపాదకీయం

## సోషల్ మీడియాతో యుద్ధం

సోషల్‌మీడియా చెడ్డదేం కాదు.. అలాగని మంచిది కూడా కాదు. వివాదాలు ముదిరి విద్వేషం పెరిగి ఆలోచనలను తొక్కేసి లక్ష్యాలను వెనక్కి నెట్టేసి అన్నట్లుగా సోషల్‌మీడియా తీరు ఇప్పుడు కనిపిస్తుంది. చాలా మంది ఎప్పుడూ ఎవరో ఒకరి మీద విద్వేషంతో ఊగిపోతున్నారు. ముఖ్యంగా సినిమా హీరోల అభిమానుల విషయంలో మరీ ఎక్కువైంది. తమ హీరో సినిమా రిలీజైతే ఒకలా వేరొక హీరో సినిమా రిలీజైతే మరొకలా రెచ్చిపోతున్నారు. ఓ దరిద్రపు ట్రెండ్ స్టార్ట్ చేశారు. ఎలాగైనా వేరే హీరోల సినిమాలు ఫ్లాఫ్ చేయాలని కంకణం కట్టుకుని తిరుగుతున్నారు. ట్రోలింగ్ చేయడానికి, ఎదుటి వారిని కించపరచడానికి సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నారు. గుంటూరు కారం నుంచి ఇప్పుడు గేమ్‌ఛేంజర్ వరకు అదే జరిగింది. సినిమాని తొక్కేయాలని కొందరు యాంటీ ఫ్యాన్స్ రచ్చ చేశారు. నెగిటివ్ రివ్యూలు ప్రచారం చేశారు. వీడియో లింక్‌లు ఇచ్చేశారు. నార్త్, ఓవర్సీస్‌లో థియేటర్లు ఖాళీగా ఉన్నాయంటూ ట్రోలింగ్ చేశారు.గేమ్ ఛేంజర్ ఫస్ట్ డే కలెక్షన్ల పోస్టర్ మీద జరిగిన రచ్చ అంతా ఇంతా కాదు. దీంతో మళ్లీ గేమ్ ఛేంజర్ కలెక్షన్ పోస్టర్లను మూవీ యూనిట్ రిలీజ్ చేయలేదు. ఎవరు చేస్తున్నారో, ఎలా చేస్తున్నారో కానీ గేమ్‌ఛేంజర్ మొదటి నుంచి టార్గెట్‌గానే కనిపించింది. ట్రైలర్ రిలీజ్ చేసినప్పుడే ఓ తప్పుడు వీడియోను వైరల్ చేశారు. థియేటర్‌లో హీరో ట్రైలర్ ఈవెంట్ కు అక్కడ జనాలు లేరని, మూలన కూర్చుని బాధపడుతున్నట్టుగా వీడియో ఒకటి షేర్ చేసి ట్రోలింగ్ చేశారు. నిజమా అబద్ధమా అని తెలుసుకోకుండా, చూసుకోకుండా వైరల్ చేసేశారు. ఇలాంటి నెగిటివ్ ట్రోలింగ్ మధ్య ఆ మూవీ వచ్చింది. రిలీజ్ తర్వాత కూడా అదే నెగిటివ్ ట్రెండ్ కంటిన్యూ అయింది.పరిణామాలపై మ్యూజిక్ డైరెక్టర్ తమన్ మాట్లాడిన మాటలు ఇప్పుడు ప్రతీ ఒక్కరిని కదలిస్తున్నాయ్. ట్రోలింగ్ సినిమాను చంపేస్తుందని ఆవేదన వ్యక్తం చేశాడు. నెగిటివ్ ట్రోల్స్ వల్ల తెలుగు సినిమా ఇండస్ట్రీ పరువు పోతుందని దయచేసి ఇది మానుకోవాలని సూచించాడు. తెలుగు సినిమా ట్రోలింగ్ చూస్తుంటే భయంగా ఉందని అదే సమయంలో సిగ్గుగా ఉందని తమన్ ఆవేదన వ్యక్తం చేయగా అతని మాటలు తనను కదిలించాయని చిరంజీవి ట్వీట్ చేశారు. విషయం సినిమా అయినా క్రికెట్ అయినా మరో సామాజిక సమస్య ఏదైనా సోషల్ మీడియా వాడుతున్న ప్రతి ఒక్కరు తమ మాటల తాలూకు ప్రభావం అవతలి వ్యక్తుల మీద ఎలా ఉంటుందో ఆలోచించుకోవాలని సూచించారు. మాటలు ఫ్రీనే అని ఐతే అవి ప్రేరేపించగలవని, ఆ మాటలే నాశనం చేయగలవని ఇందులో మీరు ఏమి చేయాలనుకుంటున్నారో ఎంచుకోండి అంటూ రాసుకొచ్చారు. దీంతో ఇప్పుడు ట్రోలింగ్ వ్యవహారం మళ్లీ తెరమీదకు వచ్చింది.సోషల్‌మీడియా వాడకం పెరిగిపోయాక దిక్కుమాలిన దరిద్రాలన్నీ మొదలయ్యాయ్. ఏ హీరో సినిమా అయినా అందరి ఫ్యాన్స్ కలిసి ఎంజాయ్ చేసే వాళ్లు ఒకప్పుడు. అలాంటిది ఇప్పుడు తమ హీరోనే గొప్ప అని అర్థం లేని యుద్ధానికి దిగుతున్నారు. అక్కడితో ఆగుతున్నారా అంటే ఓవరాల్‌గా సినిమాను చంపేస్తున్నారు. ఇప్పుడు గేమ్ ఛేంజర్ అని మాత్రమే కాదు. గతంలో చాలా మంది హీరోల విషయంలో ఇదే జరిగింది. ఏం పాపం చేశా, ఎందుకిలా అంటూ కిరణ్ అబ్బవరంలాంటి వాళ్లు స్టేజీ మీదే ఎమోషనల్ అయ్యారు. మరికొందరు అయితే నెక్ట్స్ సినిమా ఒప్పుకునేందుకు కూడా ఆలోచిస్తున్నారు. హీరోల మనోధైర్యాన్ని ట్రోలింగ్ ఇంతలా దెబ్బతీస్తోంది. ఆ హీరో అంటూ వాడు ఈ హీరో అంటూ వీడు ఎవడికి వాడు హీరో పేరు చెప్పుకొని విలన్‌గా మారుతున్నాడు. సినిమా ప్రాణం తీస్తున్నారు. దీంతో ఈ ఫ్యాన్ వార్ నిర్మాతలకు ప్రాణసంకటంగా మారుతున్న పరిస్థితి. తమ అభిమాన హీరో కోసం ఫ్యాన్స్ మిగిలిన హీరోలపై విషం చిమ్ముతూ చేస్తున్న ప్రచారంతో కొన్ని సినిమాలు బాక్సాఫీస్ దగ్గర బోల్తాపడుతున్న పరిస్థితి. అసలే ఓటీటీ కాలం ప్రేక్షకుడిని థియేటర్‌కు తీసుకురావడమే గగనం అయింది. అలాంటిది ఈ నెగిటివ్ ట్రోలింగ్ థియేటర్‌కు వెళ్లాలన్న కోరికలను కూడా చంపేస్తోంది. ఇండస్ట్రీ మీద ఎఫెక్ట్ చూపిస్తోంది.ఒకసారి ఒక హీరో సినిమాపై మరో హీరో అభిమానులు నెగెటివిటీ ప్రచారం చేస్తే ఆ హీరో వంతు వచ్చినప్పుడు తాము అదే చేస్తామని వార్నింగ్ ఇస్తున్నారు. సినిమా అలా రిలీజ్ అవగానే ఇలా నెగిటివ్ ట్రోలింగ్ స్టార్ట్ చేస్తున్నారు. వీడియోలు పోస్ట్ చేస్తున్నారు. నెగిటివ్ రివ్యూలు ఇస్తున్నారు. ఇలా ఫ్యాన్ వార్‌తో టాలీవుడ్‌లో నాన్సెన్స్ ఎక్కువైపోయింది. తెలుగు సినిమా గురించి ప్రపంచం మాట్లాడుకుంటున్న సమయంలో మన పరువు మనమే తీసుకున్నట్లు అవుతోంది. తమన్ చెప్పింది అదే. అర్థం చేసుకోండని చిరు సూచించింది కూడా అదే. గేమ్ ఛేంజర్ మూవీ విషయంలోనే కాదు గతంలో చాలాసార్లు ఇలానే జరిగింది. ఈ టార్చర్ తట్టుకోలేక కొందరు దర్శకులు, హీరోలు పోలీస్‌స్టేషన్ మెట్లు కూడా ఎక్కారు.థియేటర్‌కు ప్రేక్షకుడిని తీసుకురావడమే ఇబ్బందిగా మారుతున్న సమయంలో ఇండస్ట్రీని ఈ ట్రోలింగ్ మరింత దెబ్బతీస్తోంది. ఫ్యాన్ వార్ అనేది ఓవరాల్‌గా ఇండస్ట్రీకే సవాల్‌గా మారింది. పరిస్థితి ఇలానే కొనసాగితే సినిమా ఇండస్ట్రీ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుంది. సోషల్‌మీడియా ఫ్లాట్‌ఫామ్స్‌ను అభిమానం పేరుతో కొందరు అడ్డగోలుగా వాడేస్తున్నారు. తమ హీరోను హైలైట్ చేస్తూ ఇంకో హీరోను టార్గెట్ చేస్తున్నారు. ఫ్యాన్ వార్‌కు తెరతీస్తున్నారు. ఒకరకంగా కోలీవుడ్ కల్చర్‌ను టాలీవుడ్‌లోనూ తీసుకువస్తున్నారు. ఇది నిర్మాతలకు ఇబ్బందిగా మారుతోంది. తమన్ ఆవేదన కూడా అదే. ఇకపై సినిమా అవకాశాలు వస్తాయో రావో కూడా అర్థం కావడం లేదు అన్నాడంటే ట్రోలింగ్ మధ్య ఇండస్ట్రీ ఎంతలా నలిగిపోతుందో అర్థం చేసుకోవచ్చుఓ స్టార్ హీరో సినిమాకు ఎంత పాటిజివిటీ కనిపిస్తుందో అంతే స్థాయిలో నెగెటివిటీ వస్తుంది. ఒక్కసారిగా యాంటీ ఫ్యాన్స్ అంతా కలిసి మూవీని ట్రోలింగ్ స్టార్ చేస్తే ఎలా ఉంటుంది అనడానికి గేమ్ ఛేంజర్ బెస్ట్ ఎగ్జాంపుల్. మొదటిరోజే ఊఆ ప్రింట్‌తో సినిమాను లీక్ చేసి పడేశారు. థియేటర్‌లోనే ట్రోలింగ్ వీడియోలు, రీల్ వీడియోలు చేస్తున్నారు. పని గట్టుకుని మరీ పాతాళంలోకి తొక్కేయాలని చూస్తున్నట్లు కనిపించింది. ఇప్పుడు గేమ్‌ఛేంజర్ మాత్రమే కాదు గతంలో చాలామంది హీరోలు ఈ ట్రోలింగ్ బారిన పడ్డారు. దేవర మూవీ మీద కూడా నెగిటివ్ ట్రెండ్ చేసారు. మహేష్ బాబు గుంటూరు కారం కూడా ట్రోలింగ్ బాధిత సినిమానే. కానీ చివరకు బాక్సాఫీస్ దగ్గర పర్వాలేదనిపించుకుంది. విజయ్ దేవరకొండ ఫ్యామిలీస్టార్ అయితే ట్రోలింగ్‌లో కొట్టుకుపోయింది.ప్రస్తుతం బాక్సాఫీస్ రెస్పాన్స్ కంటే సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్‌తోనే సినిమా రిజల్ట్ డిసైడ్ అవుతున్నాయ్. ఒక సినిమా రిలీజ్ చేస్తున్నారంటే ప్రమోషన్స్ ఎలా ఉండాలని ప్లాన్ చేసుకునే వాళ్లు ఇప్పటివరకు. ఇప్పుడు సీన్ మారిపోయింది. నెగిటివ్ ట్రెండ్‌ను ఎలా కంట్రోల్ చేయాలి, ట్రోలింగ్ ఎలా ఆపాలన్నది నిర్మాతలకు తలపోటుగా మారింది. ఇప్పుడున్న సోషల్ మీడియా కాలంలో నెగెటివిటీని దాటుకొని సినిమా నిలబడటం అంటే మామూలు విషయం కాదు.


# నత్త నడకన... షట్టర్లకు తాళాలు




## ముచ్చటగా మూడు షట్టర్లకు తాళాలు

**ఏఎస్ రావునగర్, ఆగస్టు 13, తెలంగాణ దిశ) :** కాప్రా సర్కిల్ ఏఎస్ రావునగర్ డివిజన్ జై జవాన్ కాలనీ కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ షట్టర్ల స్వాధీనం నత్తనడకన కొనసాగుతుంది. షాపింగ్ కాంప్లెక్స్ లోని మొత్తం 10 షెటర్లను ఖాళీ చేయాలని జిహెచ్ఎంసి అధికారులు నోటీసులు ఇచ్చి 40 రోజులు గడుస్తున్నా.... షట్టర్లు ఖాళీ చేయడం లేదు. ఇందులో భాగంగా ఈనెల 5వ తేదీన ఒక్క షెటర్ ను స్వాధీనం చేసుకున్న జిహెచ్ఎంసి అధికారులు, బుధవారం మరో రెండు షట్టర్లకు తాళాలు వేశారు.




మిగిలిన ఏడు షెటర్లను ఖాళీ చేయడంలో నిర్వాహకులు లేనిపోని కబుర్లు చెబుతున్న జిహెచ్ఎంసి అధికారులు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. నోటీసులు ఇచ్చి 40 రోజులు గడుస్తున్న అధికారులు ఎందుకు వెనకంజ వేస్తున్నారో అర్థం కావడం లేదు. షాపింగ్ కాంప్లెక్స్ షట్టర్ల ఖాళీ విషయంలో స్పష్టత ఇచ్చేందుకు సైతం అధికారులు సుముఖంగా లేనట్లు కనిపిస్తుంది. దశాబ్దాకాల పోరాటం తర్వాత అనేక అవరోధాల మధ్య ఎట్టకేలకు షాపింగ్ కాంప్లెక్స్ లోని షట్టర్లను స్వాధీనం చేసుకోవాలని నిర్ణయానికి వచ్చినప్పటికీ స్వాధీనం చేసుకోవడంలో ఎందుకు వైఫల్యం చెందుతున్నారో అర్థం కావడం లేదు.

### తక్షణమే షట్టర్లను స్వాధీనం చేసుకోవాలి.... అద్దె సొమ్ము రూ కోటి రికవరీ చేయాలి : గగన్

జై జవాన్ కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ లోని మిగిలిన ఏడు షటర్లను జిహెచ్ఎంసి అధికారులు తక్షణమే స్వాధీనం చేసుకోవాలని సమాచార హక్కు సాధన సమితి మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కన్వీనర్ తాడూరి గగన్ కుమార్ కోరారు. ప్రభుత్వ సొమ్ముతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు ఎందుకు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. గత 12 సంవత్సరాలుగా షాపింగ్ కాంప్లెక్స్ అద్దె రూపంలో దోచుకున్న కోటి రూపాయలను కాలనీ సంక్షేమ సంఘం నాయకులనుంచి రికవరీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ఆయన హెచ్చరించారు. జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.




# గతేడాదిలో వేల సంఖ్యలో ర్యాగింగ్ ఘటనలు..!



ఇటీవలి కాలంలో కాలేజీల్లో, యూనివర్సిటీల్లో ర్యాగింగ్ ఘటనలు పెరిగిపోతున్నాయి. గత కొన్నిరోజుల్లోనే కేరళ, ఏపీ, జమ్మూకాశ్మీర్ వంటి రాష్ట్రాల్లో ర్యాంగింగ్ ఘటనలు వెలుగు చూశాయి. సీనియర్ విద్యార్థులు జూనియర్లను వేధించడం వల్ల వారు ఆత్మహత్యకు కూడా పాల్పడుతున్నారు. చట్టప్రకారం ర్యాగింగ్ నేరం. అయినప్పటికీ ఇలాంటి ఘటనలు దేశవ్యాప్తంగా ఏదో ఒక రాష్ట్రంలో వెలుగుచూస్తూనే ఉన్నాయి. ర్యాగింగ్ వల్ల కొంతమంది విద్యార్థులు అర్థాంతరంగా తనువు చాలిస్తున్నారు. మరికొంతమంది చదువులకు దూరమౌతున్నారు. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వాలు స్పందిస్తున్నప్పటికీ ర్యాంగింగ్‌ను పూర్తిగా నిలువరించలేకపోతున్నాయి. గత ఐదేళ్లలో అత్యధికంగా వెలుగుచూస్తున్న ర్యాగింగ్ ఘటలు ఏడాదికేడాది పెరుగుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి.గత ఐదేళ్లలో..: విద్యలో హింసకు వ్యతిరేకంగా పనిచేసే సేవ్ అనే ఎన్‌జీవో సంస్థ సర్వే ప్రకారం. భారత్‌లో 2020లో 226, 2021లో 546, 2022లో 1,103, 2023లో 964, 2024లో 1,086 ర్యాగింగ్ సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఎఐసిటియు (ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ 2021 నుంచి 2024 వరకు కేవలం మూడు నుంచి 11 కేసుల్లో ప్రశ్నించడం జరిగింది. యుజిసి (యూనివ్ ట్రాంట్స్ కమిషన్) 2020లో 5 కేసుల నుంచి మొదలై.. 2024 వరకు 17 కేసుల్లో మాత్రమే విచారించడం జరిగింది. ఇక ఈ ఏడాది(2025)లో 2 కేసుల్లో మాత్రమే ప్రశ్నించడం జరిగింది. ఐఎన్‌సి (ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్) 2020 నుంచి కేవలం 2 కేసుల్లో.. ఇక 2025లో ఒక్క కేసులో ప్రశ్నించడం జరిగిందని సేవ్ సంస్థ సర్వే తెలియజేస్తోంది.


జెండర్ ర్యాగింగ్స్: 2020లో 16 కేసుల్లో అబ్బాయిలు 14, అమ్మాయిలు 2, 2021లో 14 ఘటనల్లో అబ్బాయిలు 13, అమ్మాయిలు : 1, 2022లో నమోదైన 39 కేసుల్లో.. అబ్బాయిలు 33, అమ్మాయిలు 6, 2023లో 30 అబ్బాయిలు 24, అమ్మాయిలు 5, ట్రాన్స్‌జెండర్ 1, 2024లో నమోదైన 43 కేసుల్లో అబ్బాయిలు : 38, అమ్మాయిలు : 5, 2025లో 6 అబ్బాయిలు 5, అమ్మాయిలు ఒక్క ఘటనలో ర్యాగింగ్‌కి పాల్పడ్డారని సేవ్ సర్వే లెక్కలు చెబుతున్నాయి.

పెరిగిన డ్రగ్స్ వాడకం: కులం పేరుతోనో, లేక పార్టీ అధికారంలో ఉన్న వ్యక్తులకు చెందిన విద్యార్థులు ర్యాగింగ్ చేయడం కంటే డ్రగ్స్ వాడకం పెరిగినందు వల్లే ర్యాగింగ్ పెరిగిపోతుందని కొంతమంది యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్‌లు తెలిపారు. కాలేజీల్లో, యూనివర్సిటీల్లో.. సీక్రెట్‌గా డ్రగ్స్ వాడకం విపరీతంగా పెరిగింది. వీటిని అరికట్టేందకు పూనుకుంటున్నా పెద్ద ఫలితాలనివ్వలేదని లెక్కలనుబట్టే తెలుస్తోంది. విద్యార్థులు డ్రగ్స్‌కి అడిక్ట్ అయి.. డబ్బుల కోసం.. మత్తుపదార్థాల కోసం ర్యాగింగ్‌కి పాల్పడతున్నారని అధ్యాపకులతోపాటు, పలువురు విద్యార్థులు కూడా అభిప్రాయ పడుతున్నట్లు సేవ్ సంస్థ సర్వేలో తేలింది.

# నేలవిడిచి సాము చేస్తున్న పాలకులు..!

నేల విడిచి సాము చేయడం..ఓట్ల కోసం పథకాలను చేపట్టడం..పాత పథకాలను కొనసాగించడం తప్ప క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుని ముందుకు వెళ్లాలన్న ఆలోచన కానీ, ప్రణాళిక కానీ తెలుగు రాష్ట్రాలను ఏలుతున్న పాలకుల్లో కనపించడం లేదు. ఎంతసేపు కొత్త పథకాలు ప్రకటించడం, నిధులు లేక చతికిలపడడం చూస్తున్నాం. డబ్బుల దుబారాను అరికట్టలేక పోతున్నారు. దుబారా పథకాలను తగ్గించడం లేదు. ఈ విషయంలో చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు ఎవరికి ఎవరూ తీసిపోవడం లేదు. గతంలో పాలించిన జగన్, కెసిఆర్‌లు కూడా అదే చేసారు. ఉట్టికెగరలేని వాడు ఆకాశానికి ఎగిరినట్లు అన్న చందంగా వీరి పాలన ఉంటోంది. గ్రామాల్లో మంచినీటి సదుపాయం, సాగునీటి సౌకర్యాలు, విద్యుత్ సౌకర్యం, రోడ్లు వేయడం, స్కూళ్లు, ఆస్పత్రులను పటిష్టం చేయడం వంటి ప్రాథమిక అవసరాలను పక్కాగా చేయడంలో పాలకులు విఫలం అవుతూ వస్తున్నారు. కోతుల బెడద విపరీతంగా ఉన్నా అటవీశాఖ చేష్టలు ఉడిగి చూస్తోంది. ఆదాయ వనరులను లెక్కవేయకుండా, అదేపనిగా అప్పులు చేస్తూ వడ్డీలు కడుతూ, రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఉచితబస్సు,పెన్షన్లు అభివృద్ధి సూచికలు కాదని గుర్తించాలి. ప్రజలకు తాయిలాలు వేయడమెలా అన్న దారిలోంచి పక్కకు రావాలి. ప్రజలు కూడా ఉచితాల వలలో పడి దరిద్రాలను కొనితెచ్చుకుంటున్నారు. గతంలో రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేసి, కుటుంబ పాలన చేసిన కెసిఆర్ కూడా నీతులు వల్లిస్తున్నారు. ప్రజలు అత్యాశకు పోయి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెచ్చుకొని ఇప్పుడు గోసపడుతున్నారని ఓ సందర్భంలో వ్యాఖ్యానించారు. ప్రజలందరూ తన పాలనకోసం చూస్తున్నారని కూడా ఆయన చెప్పుకొచ్చారు. ఎపిలో అయితే బటన్లు నొక్కడం ద్వారా ప్రజలకు డబ్బు పంచాను. అయినా నన్ను ఎందుకు ఓడించారో అర్థం కావడంలేదని జగన్ వాపోయారు. ఈవీఎంల ద్వారా ఏదో గోల్‌మాల్ చేసి ఉంటారని తన అసమర్థతను అలా చాటుకున్నారు. ఈవీఎంలను మేనేజ్ చేసి ఉంటారని 2019లో ఓటమి అనంతరం చంద్రబాబు కూడా వ్యాఖ్యానించారు. తాము బాగు చేశామని అనుకోవడం కన్నా..ప్రజలు అనుకుంటున్నారా లేదా అన్నది ఆలోచచించడం లేదు. గ్రామాల్లో పచ్చదనం కరువయ్యింది. పశువులకు గ్రాసం దొరకడం లేదు. ఎండాకాలానికి ముందే మంచినీటి ఎద్దడి ఏర్పడింది. గ్రామాల్లో కోతుల బాధ విపరీతంగా ఉంది. వీటి గురించి ఆలోచచించడం లేదు. డిలిమిటేషన్ సీట్లు, హిందీ వద్దనడం వంటి వాటిపట్ల కొందరు చేసే ఆందోళనకు మద్దతు పలకడం అలవాటు చేసుకున్నారు. ఎన్ని సీట్లు పెరిగినా ప్రజలకు ఒరిగేదేముంది. పార్లమెంట్ సీట్లు పెరిగితే మరింత ఖజానా భారం తప్ప ప్రజలకు వచ్చే లాభం లేదు. అధికారంలో ఉన్నప్పుడు తాము ఏ తప్పూ చేయ లేదని, ప్రజలే తమను ఓడించి తప్పు చేశారని ప్రాంతీయ పార్టీలకు నాయకలు చేస్తున్న వ్యాఖ్యలు వారి అహంకానానికి నిదర్శనంగా చూడాలి. అధికారంలోకి వచ్చినవారు, ముఖ్యంగా ప్రాంతీయ పార్టీల అధినేతలు తమ చుట్టూ రక్షణ వలయాన్ని ఏర్పాటు చేసుకొని ప్రజలను దూరం పెడుతున్నారు. ప్రజలు నేరుగా వచ్చి సమస్యలు చెప్పుకునే అవకాశం ఇవ్వడం లేదు. ప్రజావాణితో తెలంగాణలో అర్జీలు స్వీకరించడం ఓ ఫ్యాషన్‌గా మారింది. ప్రజల సమస్యలు పరిష్కారం అయినట్లు దాఖలాలు లేవు. ప్రజల మనోభావాలను తెలుసుకొనే ప్రయత్నం చేయడం లేదు. ప్రజల్లో తమ పట్ల వ్యతిరేకత ఏర్పడిన విషయాన్ని ప్రాంతీయ పార్టీల అధినేతలు తెలుసుకోలేక పోతున్నారు. పాలన అంటే పందేరాలు, పెన్షన్లు, రేషన్ కార్డులే అనుకుంటున్నారు. వీటికోసం వేలకోట్లు తగలేసి అప్పులు చేస్తున్నారు. దీంతో అభివృద్ధి అన్నది కానరావడం లేదు. తమ హంగూ,ఆర్భాటాలు, రక్షణ, జీతాలు, పెన్షన్లకు వేలకోట్లు తగలేస్తున్నారు. ప్రజల మనోభావాలు తెలుసుకొనే ప్రయత్నం చేస్తే తాము ఎక్కడ ఉన్నామో తెలిసి పోతుంది. కర్ణాటకలో బీజేపీ అధికారం కోల్పోయి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆ రాష్ట్రంతో సంబంధం లేని వాళ్లు కూడా ముందే చెప్పారు. బిజెపి కూడా పాలనలో మార్పు చూపించలేకపోతున్నది. జిఎస్టీ వసూళ్లు ప్రజల నడ్డి విరుస్తున్నా పట్టించుకోవడం లేదు. తన పాలన పట్ల 70 శాతానికి పైగా ప్రజలు సంతృప్తితో ఉన్నారని చంద్రబాబు ఇప్పటికీ చెప్పుకుంటున్నారు. రేవంత్ రెడ్డి కూడా అదే చేస్తున్నారు. గత అనుభవాలను విస్మరించి ఇప్పుడు మళ్లీ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అని కలవరిస్తున్నారు. ఏఐ అంటే ఏమిటో 90 శాతం ప్రజలకు తెలియదు. వాటివల్ల కలిగే ప్రయోజనాలేమిటో అంతకంటే తెలియదు. 90 శాతానికి పైగా ప్రజలకు తెలియని అంశాన్ని పదేపదే వ్లలెవేయడం వల్ల ప్రయోజనం ఏమిటో చంద్రబాబుకే తెలియాలి. ప్రభుత్వ ఉద్యోగులు పని ఒత్తిడిని అధిగమించి సంతోషంగా ఉండేందుకు ప్రతి ఆదివారం అమలు జరిగేలా ఒక కార్యక్రమం రూపొందిస్తామని చంద్రబాబు తాజాగా ప్రకటించారు. ప్రభుత్వ వ్యవహారాలన్నీ ఇప్పుడు ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. కొంతమంది మినహా మెజారిటీ ప్రభుత్వ ఉద్యోగులపై పని భారం కూడా అధికంగా ఉండటం లేదు. చంద్రబాబు పాలనలో నిరంతర సమీక్షల వల్లనే ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు అధిక ఒత్తిడికి గురవుతారన్న విషయం తెలుసుకోవడం లేదు. ఇకపోతే సమీక్ష చేసిన అంశం అమలువుతుందా అన్న పరిశీలన లేదు. క్షేత్రస్తాయికి దానిని తీసుకుని అమలు చేశారా అంటే అదీ లేదు. ప్రభుత్వాలు సరైన ప్రాధాన్యాలను నిర్దేశిరచుకొని సత్వర నిర్ణయాలు తీసుకుంటే ఉద్యోగులపై ఒత్తిడి ఉండదు. గ్రామస్థాయి ప్రణాళికలు ఇందుకు ముఖ్యం. ఏ గ్రామంలో ఏమి అవసరం అన్నది ముఖం. కులగణనలు కాదు. దాంతో చిచ్చులు రేగుతాయే తప్ప మరోటి కాదు. రాజీవ్ పేరుతో మరో పథకం తెస్తామని భట్టి ప్రకటించారు.

# ఈ ప్రకృతి విడిది మనమూ బుక్ చేసుకోవచ్చు





పల్లెటూరి వాసన తెలియకుండా పెరిగిందామె! కానీ, ఇప్పుడు పల్లెదనాన్ని పరిచయం చేస్తూ ఆంత్రప్రెన్యూర్‌గా రాణిస్తున్నది. ప్రకృతి ఆరాధకుడైన తన భర్త కలలను సాకారం చేస్తూ.. ఆతిథ్య రంగంలోకి అడుగుపెట్టింది. పచ్చని పొలాలు, పండ్ల తోటల నడుమ మండువా లోగిలి నిర్మించి.. అతిథులకు ఆహ్వానం పలుకుతున్నది. పశు పక్ష్యాదుల పలకరింపులతో అలరారే ఈ సంప్రదాయ గృహాన్ని జాయ్‌ఫుల్ వీకెండ్ డెస్టినేషన్‌గా నిలిపింది. పంటపొలాలు లేనివాళ్లు, పల్లెలకు దూరంగా వచ్చినవాళ్లు.. వారాంతంలో ఇక్కడికి వచ్చి ఆనందాన్ని వెతుక్కుంటున్నారు. ఏనాడూ పల్లె వాతావరణం తెలియని ఆమె.. పట్నవాసులకు గ్రామీణ వాతావరణాన్ని అందిస్తున్న ది. వ్యవసాయ క్షేత్రాన్ని వ్యాపార కేంద్రంగా మలిచిన గ్రీన్ ఎకర్స్ వ్యవస్థాపకురాలు తల్లా అనిత స్టార్టప్ స్టోరీ ఆమె మాటల్లోనే..

నేను పుట్టింది హైదరాబాద్‌లో. ఇక్కడే పెరిగాను. ఏనాడూ సిటీ దాటింది లేదు. పల్లెటూరు ఎలా ఉంటుందో కూడా తెలియదు. ఉద్యోగరీత్యా కొన్నాళ్లు అమెరికాలో ఉన్నాం. మా ఆయన తల్లా వెంకటేశ్వర్‌కు వ్యవసాయం అంటే చాలా ఇష్టం. ఆయనతో కలిసి వ్యవసాయక్షేత్రంలోకి అడుగుపెట్టాను. అదే గ్రీన్ ఎకర్స్ వీకెండ్ హోమ్‌కు బీజం వేసింది. 1999లో సన్నిహితులతో కలిసి కొనుగోలు చేసిన ఐదు ఎకరాల భూమిలో ఆర్గానిక్ వ్యవసాయం మొదలుపెట్టాం. అలా గ్రీన్ ఎకర్స్ కార్యకలాపాలు మొదలయ్యాయి. ఆర్గానిక్ ఫార్మింగ్ చేసినా అంతగా గిట్టుబాటు కాలేదు. ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను అన్వేషిస్తున్న క్రమంలో గ్రీన్ ఎకర్స్ ఫార్మ్ స్టే ఆలోచన వచ్చింది. అలా పదేండ్ల కిందట మా వ్యవసాయ క్షేత్రంలో అర ఎకరం విస్తీర్ణంతో తాతలనాటి మండువా ఇల్లు కట్టించాం. చుట్టూ ఆరు ఎకరాల్లో తోటలు పెంచి వీకెండ్ డెస్టినేషన్ హోమ్‌గా దీనిని తీర్చిదిద్దాం. నిత్యం బిజీగా ఉంటూ, ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా కలుసుకోవడానికి ఓ అందమైన వేదిక ఇది. మా ఆయన సహకారంతో మా వ్యవసాయక్షేత్రాన్ని ఎకో ఫ్రెండ్లీ విహార కేంద్రంగా మలిచాను.

**ఇల్లే అర ఎకరం:** కేరళ, కొచ్చి లాంటి ప్రాంతాలను సందర్శించినపుడు అక్కడ కనిపించే మండువ లోగిళ్లు నాకెంతో నచ్చాయి. వాటిని ఆదర్శంగా తీసుకొని దీనిని రూపకల్పన చేశాను. వీకెండ్‌లో సరదాగా పంటపొలాలు, పచ్చని చెట్ల నడుమ స్వచ్ఛమైన ప్రాణవాయువుతో పునరుత్తేజం కలిగించే ఫార్మ్ స్టే హోమ్ నిర్మాణం కోసం ఎంతగానో అధ్యయనం చేశాను. ఎన్నో పర్యాటక ప్రాంతాలను సందర్శించి అరుదైన కళాకృతులు సేకరించా. నిర్మాణ శైలిలోనూ ప్రత్యేకత కనిపించేలా జాగ్రత్తలు తీసుకున్నా. కనుచూపు మేరలో చిక్కటి పచ్చదనంతో దీనిని తీర్చిదిద్దాం. అర ఎకరంలో విస్తరించిన ఈ ఇంట్లో ఆరు పడకగదులు, విశాలమైన సిట్ అవుట్, ఓపెన్ జిమ్ ఏర్పాటుచేశాం. ఒకసారి గ్రీన్ ఎకర్స్‌లో అడుగుపెడితే.. ప్రపంచాన్ని మర్చిపోయి సరదాగా కాలం గడిపేయొచ్చు.

**పసందైన విందు:** యాంత్రిక జీవనంతో పోటీపడుతూ బంధాలకు దూరమైన ఎంతోమంది ఈ పచ్చని పొలాలు, పక్షుల రాగాల నడుమ సేదతీరుతున్నారు. కాంక్రీట్ జంగిల్‌లో బతుకుతున్న ఈ తరానికి మన మూలాలను పరిచయం చేయాలన్న మా సంకల్పం దీంతో నెరవేరింది. గ్రీన్ ఎకర్స్ చుట్టూ పది ఎకరాల విస్తీర్ణంలో పూర్తిగా సేంద్రియ విధానంలో పంటలు సాగు చేస్తున్నాం.

ఇక్కడ పండించిన వాటినే అతిథులకు భోజనంగా అందిస్తున్నాం. గ్రీన్ ఎకర్స్‌కు ఒకసారి వచ్చిన వారంతా మళ్లీ మళ్లీ రావడానికి ఉత్సుకత చూపుతున్నారు. పంట పొలాల మధ్య హాయిగా కాలం గడుపుతున్నారు. హైదరాబాద్‌తోపాటు బెంగళూరు నుంచి కూడా గ్రీన్‌ఎకర్స్‌లో గడిపేందుకు ఔత్సాహికులు వస్తున్నారు. విదేశాల్లో స్థిరపడి, స్వదేశానికి వచ్చినవాళ్లు తమ బంధువులతో ఇక్కడ గెట్ టుగెదర్ జరుపుకొంటున్నారు.

**అచ్చెరువొందేలా..:** ఈ స్టే హోమ్ నిర్మాణ శైలి ప్రత్యేకంగా ఉంటుంది. దీనికోసం దక్షిణ భారతంలో కొన్ని పర్యాటక ప్రాంతాలను సందర్శించి, అక్కడ నుంచి పురాతన ఫర్నీచర్ సేకరించాను. ఈ లోగిలిలో కిటికీలు, ప్రధాన ద్వారాలు, తలుపులు, స్తంభాలన్నీ కూడా వంద సంత్సరాల కిందట డిజైన్ చేసినవాటి శైలిలో ఉంటాయి. ఇంటి ఆవరణ, పరిసరాలు కూడా ప్రత్యేకంగా ఉంటాయి. పిల్లగాలికి ఊగుతూ చిన్నారులను జోలపుచ్చే ఊయలలు, నులక మంచాలు, పడుకునేందుకు పెద్ద పీటలు ఇలా ఇక్కడున్నవన్నీ అచ్చెరువొందిస్తాయి. యూఎస్‌లో స్థిరపడిన మా పిల్లలు కరోనా సమయంలో ఇక్కడికి వచ్చారు. మూడు నెలలు గ్రీన్ ఎకర్స్‌లో మేమంతా హాయిగా గడిపాం. అదే ఆనందాన్ని నాతోపాటు మరెన్నో కుటుంబాలకు అందిస్తున్నాను. ఇంతకీ మా గ్రీన్ ఎకర్స్ ఫార్మ్ స్టే హోమ్ ఎక్కడున్నది చెప్పలేదు కదూ! తెలంగాణలో ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న యాదగిరిగుట్ట క్షేత్రానికి దగ్గర్లో, కూనురు గ్రామ సమీపంలో ఈ ప్రకృతి నిలయం ఉంది.


## పౌరసేవల్లో డేటా రక్షణ ముఖ్యం

### సమాచార దుర్వినయోగంపైనా దృష్టి అవసరం

**అమరావతి,తెలంగాణ దిశ :** ఎపిలో 150 రకాల పౌరసేవలను వాట్సాప్ ద్వారా అందించడం జరుగుతోంది. ఎలాంటి ఇబ్బంది లేకుండా పలు రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. మంత్రి లోకేశ్ తీసుకున్న చొరవ కారణంగా, కుల, ఆదాయ ధృవీకరణ వంటి అనేక పత్రాలను నేరుగా పొందే అవకాశం ఏర్పడింది. అయితే డేటా రక్షణ చట్టం లేకుండా కేవలం వాట్సాప్ ద్వారా అందిస్తే పౌరుల ప్రాథమిక హక్కులకు భంగకరమన్న వాదనలు వస్తున్నాయి. ఆందోళన కూడా వ్యక్తం అవుతోంది. రాష్ట్రంలో వాట్సాప్ ద్వారా ఈ గవర్నెన్స్ సేవలు అందించేందుకు కంపెనీలతో ఒప్పందం చేసుకున్నట్లు దాన్ని 18వ తేదీన ప్రారంభించబోతున్నట్లు సిఎం చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. ఏదైనా ఒక సర్టిఫికెట్ కావాల్సి వస్తే దానికి సంబంధించిన డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయాలని, వాట్సాప్‌లో అవి భద్రంగా ఉంటాయన్న గ్యారంటీ లేదన్న వాదన వస్తోంది. వాటిని దుర్వినియోగం చేయరన్న చట్టబద్ధ హామీ లేదు. 2018 నుండి డేటా ప్రైవసీ చట్టం పెండింగ్‌లోనే ఉందని, అది చట్టం కాకుండా ఇలాంటి ఒప్పందాలు పౌరుల వ్యక్తిగత భద్రతకు ముప్పని అంటున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఊడా ఇదేరకమైన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ఆధార్ సహా అనేక రకాల డాక్యుమెంట్లు దుర్వినియోగమైన విషయం విదితమేనని పేర్కొన్నారు. పౌర సేవలు వేగంగా అందుతాయో లేదో గ్యారంటీ లేదని, కానీ రాజకీయ, వ్యాపార ప్రయోజనాలకు డేటా దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే మీ సేవ, సచివాలయ వ్యవస్థలున్నాయని, వాట్సాప్‌తో ఒప్పందం చేసుకుని సచివాలయ సిబ్బందిని తగ్గించాలన్న యోచనలో ప్రభుత్వం ఉందని, దీనివల్ల మీ సేవ సిబ్బంది నిరుద్యోగులవుతారని అన్నారు.

గోప్యంగా ఉండాల్సిన పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని అంబానీ, మెటా వంటి కార్పొరేట్ కంపెనీలపరం చేయడం అభ్యంతరకరమని పేర్కొన్నారు. డేటా ప్రైవసీ రక్షణ చట్టం వచ్చేంత వరకు ఈ ఒప్పందాన్ని అమలు చేయొద్దని, సచివాలయ సిబ్బందిని కుదించొద్దని, మీసేవా కేంద్రాలకు భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. నిజానికి సేవలు అందించడంతో పాటు, చట్టబద్ధత కూడా ముఖ్యమని గుర్తించి, డేటా రక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంది.

# పెరుగుతున్న విద్యుత్ వినియోగం



### రెండు నెలలుగా 65 మిలియన్ యూనిట్ల డిమాండ్

### చలి తీవ్రత పెరిగినా.. తగ్గని విద్యుత్ డిమాండ్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** :సాధారణంగా చలికాలంలో విద్యుత్ వినియోగం తగ్గుతుంటుంది. కానీ ఇందుకు భిన్నంగా ఈసారి గ్రేటర్‌లో చలి ఎక్కువగానే ఉన్నా విద్యుత్ వినియోగం మాత్రం పెరుగుతూ ఉన్నది. 2023లో గ్రేటర్ వ్యాప్తంగా 50 నుంచి 55 మిలియన్ యూనిట్ల వరకు విద్యుత్ డిమాండ్ నమోదవగా.. గత రెండు నెలలుగా ప్రతిరోజూ 60–65 మిలియన్ యూనిట్ల వరకు విద్యుత్ డిమాండ్ నమోదవుతున్నది. 2023లో గ్రేటర్ పరిధిలో విద్యుత్ వినియోగం వార్షిక సగటు డిమాండ్ 2917 మెగావాట్ల నుంచి 2024లో 3218 మెగావాట్లకు పెరిగింది. వృద్ధి కూడా 10.18 శాతంగా నమోదైంది. రాష్ట్ర వ్యాప్తంగా గత డిసెంబర్ 19నుంచి రోజూ గరిష్ఠ స్థాయిలో 257 మిలియన్ యూనిట్ల వినియోగమవుతోంది.

2023లో ఇదే సమయానికి 217 మి.యూ.లే ఉన్నది. రోజూ ఏకంగా 40 మిలియన్ యూనిట్ల డిమాండ్ పెరగడంతో డిస్కంలు అప్రమత్తమయినట్లు అధికారులు చెబుతున్నారు. ఒక్క గ్రేటర్‌లోనే గతం కంటే అదనంగా 200 మెగావాట్ల డిమాండ్ పెరిగింది. నగరంలో పారిశ్రామిక, గృహ వినియోగం వల్ల ఈ డిమాండ్ అధికమైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. నగర పరిధిలో 2024 డిసెంబర్ నాటికి 62.92 లక్షల కనెక్షన్లు ఉన్నాయి. 2023లో 60.26 లక్షలు ఉన్నాయి. సంవత్సర కాలంలో రెండు లక్షల కొత్త కనెక్షన్లు వచ్చాయి.

**ఆ నాలుగు నెలలు కీలకం..:** సాధారణంగా విద్యుత్ వినియోగం మార్చి నుంచి గణనీయంగా పెరుగుతున్నది. ప్రతి సంవత్సరం మార్చి, ఏప్రిల్, మే నెలల్లో గరిష్ఠ స్థాయిలో వాడకం నమోదవుతున్నది. అయితే 2024 మార్చిలో వినియోగం 24.52 శాతం పెరుగుదల కనిపించగా, ఏప్రిల్‌లో 19.66 శాతం, మేలో 13.46 శాతం, జూలైలో 12.91 శాతం పెరుగుదల నమోదైంది. జూన్‌లో మాత్రం వినియోగం తగ్గింది. గత అనుభవాల దృష్ట్యా ఈ ఏడాది వేసవికి డిస్కం కార్యాచరణ చేపట్టింది. గత రెండేళ్లలో 80 నుంచి 90 మిలియన్ యూనిట్ల వినియోగం నమోదు కాగా.. ఈ సారి సెంచరీ దాటుతుందని అంచనా వేస్తున్నారు. గరిష్ఠ డిమాండ్ 5 వేల మెగావాట్లకు తగ్గట్లుగా కార్యాచరణ రూపొందిస్తున్నారు. జనవరి చివరి వరకు అందుకు తగినట్లుగా పనులు పూర్తి చేయాలని సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ అధికారులను ఆదేశించినా ఇంకా పనుల్లో వేగం పుంజుకోలేదు. సాంకేతిక కారణాల వల్ల ఫిబ్రవరి మొదటి వారం వరకు పనులు పూర్తిచేస్తామని అధికారులు చెప్పారు. మరోవైపు గ్రేటర్లో విద్యుత్ వినియోగం పెరగడానికి గృహజ్యోతి పథకం కూడా కారణంగా అధికారులు చెబుతున్నారు. గ్రేటర్ పరిధిలోని 10 సర్కిళ్లలో 10.5 లక్షల మంది గృహజ్యోతి లబ్ధిదారులున్నారు. వారిలో గతంలో ప్రతినెలా 100 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే లక్షల మంది కనెక్షన్ దారులు గృహజ్యోతి అమలుతో ప్రతినెలా 140–160 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగిస్తున్నారు. మరికొన్నిచోట్ల 180 యూనిట్ల వరకు కరెంట్ వినియోగిస్తుండడంతో విద్యుత్ డిమాండ్ పెరిగింది. గ్రేటర్ పరిధిలోని పది సర్కిళ్లలో అత్యధికంగా సంగారెడ్డి సర్కిల్‌లో 2.13 లక్షల మంది, రాజేంద్రనగర్‌లో 1.33 లక్షలు, హబ్సిగూడ సర్కిల్‌లో 1.28 లక్షలు, మేడ్చల్ సర్కిల్లో 1.15 లక్షల మంది గృహజ్యోతి లబ్ధిదారులు ఉండగా.. వినియోగదారులు ఎక్కువగా ఉన్న సర్కిళ్లలో 2023 కంటే 2024లో 15–20శాతం విద్యుత్ డిమాండ్ పెరిగింది.

## పుంజుకుంటున్న కళ్యాణ్ జ్యువెల్లర్స్ షేర్లు




హైదరాబాద్: ఇటీవల కల్యాణ్ జ్యువెల్లర్స్ షేర్లు భారీ పతనానికి గురయ్యాయి. ఈ క్వార్టర్ రిజల్ట్స్ అద్భుతంగా వచ్చినప్పటికీ వరుసగా స్టాక్ ఫాల్ అవుతూ దాదాపు 40 శాతం పడిపోయింది. కల్యాణ్ జ్యువెల్లర్స్ షేర్లను పెంచేందుకు మోతీలాల్ ఓస్వాల్ కంపెనీ ఫండ్ మేనేజర్లు ఫ్రాడ్ చేశారనే ఆరోపణలు వచ్చాయి. డబ్బులు తీసుకుని కంపెనీ షేర్లను అమాంతం పెంచేశారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో కంపెనీ షేర్లు దారుణంగా పడిపోయాయి. కంపెనీపై వస్తున్న ఆరోపణలపై యాజమాన్యం స్పందించింది. తమ కంపెనీ షేర్లను పెంచేందుకు ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదని వివరణ ఇచ్చారు. అయినప్పటికీ షేర్ల పతనం ఆగలేదు. కేవలం రెండు వారాలలోనే రూ.27,400 కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ కోల్పోయింది. మోతీలాల్ ఓస్వాల్ ఈ ఆరోపణలపై స్పందించింది. తమ కంపెనీ ఫండ్ మేనేజర్లు ఎలాంటి తప్పు చేయలేదని తెలిపింది. కల్యాణ్ జ్యువెల్లర్స్ షేర్ పెంచేందుకు ఎలాంటి అవినీతి చేయలేదని వివరణ ఇచ్చింది. మోతీలాల్ ఓస్వాల్ ప్రకటన తర్వాత కల్యాణ్ జ్యువెల్లర్స్ షేర్లలో కదలిక వచ్చింది.


# రేషన్ బియ్యం అక్రమాలపై చర్యలేవీ..?

పేదల ఆకలి తీర్చాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన రూపాయికే కిలోబియ్యం పథకం పందికొక్కుల పాలవుతోంది. ఇదంతా పెద్ద మాఫియాగా మారింది. బియ్యం మొత్తం విదేశాలకు తరలుతున్నాయి. కొందరు అధికారులు, రాజకీయ నేతలు కలసి దీనిని బడా వ్యాపారంగా మార్చేశారు. రూపాయికే కిలో బియ్యం పథకంలో లోపాలు కళ్లకు కనిపిస్తున్నా తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కావాలనే అచేతనంగా ఉండిపోయాయి. పథకం దుర్వినియోగం అవుతున్నా పట్టించుకోవడం లేదు. 42 ఏళ్ల క్రితం కిలో రెండు రూపాయలుగా ఉన్న బియ్యాన్ని తలకుమాసిన నేతలు అధికారంలోకి వచ్చి..కిలో రూపాయి చేశారు. ఇప్పటికే జనాభాలో 80శాతం మందికి ఈ బియ్యం ఇస్తున్నట్లు చెబుతున్నారు. అయినా ఇంకా కొత్తగా రేషన్ కార్డుల డిమాండ్ పుట్టుకొస్తోంది. పాతవాటిలో అక్రమాలను అరికట్టి, బియ్యం ధరలు పెంచి పక్కాగా పథకాన్ని అమలు చేయాల్సిన ఇరు రాష్ట్రాల సిఎంలు ఇంకా ప్రజలను మభ్య పెడుతున్నారు. వేలకోట్లు దుర్వినియోగం అవుతున్న ప్రజాధనానికి ఎవరు బాధ్యులు అన్నది చెప్పడం లేదు. ప్రజలు చెమటోడ్చి కడుతున్న పన్నుల డబ్బులను ఇష్టారీతిన వృధా చేయడమేనా పాలకుల పని అని ప్రజలు నిలదీయాల్సి ఉంది. ఇకపోతే ఎపిలో పేదల బియ్యం పూర్తిగా పక్కదారి పట్టాయి. రాష్ట్రంలో పేదలకు అందాల్సిన సబ్సిడీ బియ్యం టన్నుల కొద్దీ అక్రమంగా విదేశాలకు తరలించిన తీరు బయటపడ్డా కఠిన చర్యలు తీసుకోవడం లేదు. ఇందుకు ప్రతిపక్ష వైసిపి కారణమని టిడిపి కూటమి ఆరోపిస్తుంటే, మీరే కారణమని వైసిపి నేతలు టిడిపి, జనసేన నేతలను విమర్శిస్తున్నారు. ఈ పరస్పర విమర్శలతో కాలక్షేపం చేస్తున్నారు. లక్షల టన్నుల బియ్యాన్ని కొన్నేళ్ళుగా యథేచ్ఛగా తరలిస్తూ వచ్చారు. అసలు దోషులు బయట పడకుండా పేదల బియ్యాన్ని పెద్దలు గద్దల్లా ఎగరేసుకుపోయారు. తెలంగాణలో సైతం ఇలాంటి దోపిడీ జరుగుతున్నా చర్యలు తీసుకోవడం లేదు. ఓట్లమీద ఉన్న శ్రద్ధ అక్రమాలను అరికట్టడం లో కనిపించడం లేదు. ప్రజా పంపిణీ ద్వారా పేదలకు అందుతున్న బియ్యం అసలు పేదలకు అందడం లేదన్నది అక్షర సత్యం. ఈ బియ్యం ఆటో, లారీల స్థాయి దాటి ఓడల వరకు చేరిందని రుజువయ్యింది. బియ్యం పథకం పంపిణీ కార్యక్రమం కేంద్రానిదని, ప్రతి స్టోర్ దగ్గర మోడీ ఫోటో పెట్టాలని తెలంగాణ, ఆంధ్రలో పెద్ద యాగీ చేసిన కేంద్ర మంత్రులు, బిజెపి పెద్దలు అక్రమ బియ్యం తరలింపు విషయంలో ఎందుకు మౌనంగా ఉంటున్నారు. ఎందుకు దీనిపై చర్యలకు ఉపక్రమించడం లేదు. అన్ని రకాల సబ్సిడీ పథకాలను రద్దు చేసి సమీక్షించాలి. నిజమైన పేదలను గుర్తించాలి. దుబారా పథకాలకు కాలం చెల్లిందన్న విధంగా కళ్లెం వేయాలి. నగదు బదిలీ పథకాల అమలుపై సమీక్షించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఓట్లు ముడిపడి వున్నందున దీనిని సమీక్షించడం సాధ్యం కావడంలేదు. పేదలు రేషన్ బియ్యం ఎందుకు అమ్ముకుంటారన్న చర్చ చేయాలి. బహిరంగ మార్కెట్‌లో కనీసం 40లుగా ఉన్న బియ్యం ఇప్పుడు రూపాయికే దక్కితే అవి పెద్ద వ్యాపార వస్తువుగా మారింది. ఓడలకు ఎక్కించగలిగినంత బియ్యం అమ్మగలగడం ఇందుకు నిదర్శనం. ఎపిలో గత ఐదేళ్ళలో 1.31 కోట్ల టన్నుల రేషన్ బియ్యం దేశం దాటి విదేశాలకు వెళ్లిందని టిడిపి కూటమి ప్రభుత్వం విమర్శిస్తున్నది. కాకినాడ ఓడరేవులో సిద్ధంగా వున్న ఓడను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తనిఖీ చేసి సీజ్ చేయమని ఆదేశించారు. విశాఖపట్నం ఓడరేవులో రాష్ట్ర సివిల్ సప్లరు శాఖ మంత్రి ఇలాగే ఓ ఓడను తనిఖీ చేసి అందులో వున్న బియ్యం పేదల బియ్యమేనని ప్రకటించారు.

ఇక తెలంగా ణలో ఎంత దోచకున్నారో కిక్కురుమనడం లేదు. ఒకవైపు తిండి లేక పేదలు అల్లాడుతుంటే ఇంత పెద్ద ఎత్తున అక్రమంగా తరలిస్తున్న బియ్యం దొంగలను పట్టుకుని కఠినంగా శిక్షించాల్సిందే. అధికార పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం అనర్హులకు రేషన్ కార్డులు ఇవ్వడంవల్ల, అందులో ఎక్కువ మంది బియ్యం అమ్ముకునే వారు వుండే అవకాశం ఉంది. కానీ అత్యధిక పేదలు రేషన్ బియ్యంతోనే నెలలో కొద్ది రోజులైనా కడుపు నింపుకుంటున్నారు. ఇలా అక్రమాలను పక్కన పెట్టి సన్న బియ్యం ఇస్తామని ఒకరు, నాణ్యమైన బియ్యం ఇస్తామని మరొకరు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత...బియ్యాన్ని వ్యాపారంగా మార్చేస్తున్నారు

# టిక్‌టాక్ ఈజ్ బ్యాక్..

## ట్రంప్ హామీతో యాప్ సేవల పునరుద్ధరణకు శ్రీకారం






ప్రముఖ షార్ట్ వీడియో యాప్ టిక్‌టాక్ అగ్రరాజ్యం అమెరికాలో మూగబోయిన విషయం తెలిసిందే. జనబాహుల్యంలో విశేష ఆదరణ పొందిన ఈ షార్ట్ వీడియో యాప్‌ను నిషేధించేందుకు తీసుకొచ్చిన చట్టం ఆదివారం నుంచే అమల్లోకి రావడంతో తన సేవలను సంస్థ ఒకరోజు ముందే నిలిపివేసింది. ఈ విషయాన్ని స్వయంగా ఆ కంపెనీ మాతృసంస్థ బైట్‌డ్యాన్స్ శనివారం ప్రకటించింది. అయితే, ఈ ప్రకటన చేసిన కొద్దిసేపటికే టిక్‌టాక్ మరో ప్రకటన చేసింది. యూజర్లకు తిరిగి సేవలను పునరుద్దరించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపింది. ఈ మేరకు 'యూఎస్‌లో టిక్‌టాక్ ఈజ్ బ్యాక్' అంటూ పోస్టు పెట్టింది. టిక్‌టాక్ సేవలకు సంబంధించి కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేసిన విషయం తెలిసిందే. టిక్‌టాక్ కంపెనీలో కనీసం 50 శాతం వాటా అమెరికా పెట్టుబడిదారుల చేతిలో ఉండేలా షరతులు విధిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ద్వారా వాటి సేవలను పునరుద్ధరించనున్నట్లు ప్రకటించారు. తన ప్రమాణం తర్వాత ఈ ఆర్డర్ పై సంతకం చేయాలని యోచిస్తున్నట్టు తెలిపారు. అయితే, 50 శాతం షరతుకు అంగీకరించాలని సూచించారు. తాము తమ వ్యాపారాన్ని చైనాకు గానీ, ఇతరులకు గానీ అప్పగించాలని అనుకోవడం లేదన్నారు. ఇలా చేయడం ద్వారా తమ దేశ పౌరుల డేటా చైనాకు చేరుతోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ట్రంప్ ప్రకటనపై టిక్‌టాక్ స్పందించింది. అమెరికాలో తమ సేవలు పునరుద్ధరణపై ట్రంప్ నుంచి భరోసా లభించడంతో ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు ఓ ట్వీట్ పెట్టింది. 'మా సర్వీస్ ప్రొవైడర్లతో కుదిరిన ఒప్పందం ప్రకారం.. అమెరికాలో తిరిగి టిక్‌టాక్ సేవలను పునరుద్ధరించే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ విషయంలో కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నాం. మా సర్వీస్ ప్రొవైడర్లు ఎదుర్కొనే పెనాల్టీలపై ఆయన హామీ ఇచ్చారు. ఫలితంగా 17 కోట్ల మంది అమెరికన్లకు టిక్ టాక్ సేవలు అందుతాయి. 70 లక్షల చిన్న వ్యాపారాలు వృద్ధి చెందుతాయి. ఇది ఏకపక్ష సెన్సార్‌షిప్‌కు వ్యతిరేకంగా ట్రంప్ ఇచ్చిన బలమైన స్టాండ్. టిక్‌టాక్‌ను తిరిగి కొనసాగిస్తూ దీర్ఘ కాలిక పరిష్కారాల కోసం అధ్యక్షుడు ట్రంప్‌తో కలిసి పని చేస్తాం' అని తెలిపింది. మరో సందేశంలో 'అధ్యక్షుడు ట్రంప్ ప్రయత్నాల ఫలితంగా.. అమెరికాలో టిక్‌టాక్ ఈజ్ బ్యాక్' అని పేర్కొంది. 2017లో ప్రారంభమైన టిక్‌టాక్‌ను భారత్ సహా అనేక దేశాలు ఇప్పటికే నిషేధించారు. అమెరికాలోని కొన్ని రాష్ట్రాలు కూడా దీని వినియోగ ంపై ఆంక్షలు విధించాయి. ఈ నేపథ్యంలో చైనా యాజమాన్యాన్ని వదులుకోకపోతే నిషేధం ఎదుర్కోవాల్సిందేనంటూ అమెరికా ప్రతినిధుల సంభ ఇటీవల ఒక బిల్లుకు ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. అదేవిధంగా జనవరి 19 లోగా యూఎస్ టిక్‌టాక్‌ను విక్రయిస్తారా? లేదా నిషేధాన్ని ఎదుర్కొంటారా? ఏదో ఒకటి నిర్ణయించుకోవాలంటూ అమెరికా సుప్రీం కోర్టు బైట్‌డ్యాన్స్‌కు డెడ్‌లైన్ విధించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలోనే దేశంలో తన సేవలను నిలిపివేస్తున్నట్లు తాజాగా ఆ సంస్థ ప్రకటించింది. అయితే ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత టిక్‌టాక్ పునరుద్ధరణకు ప్రయత్నించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. ఈ క్రమంలో ట్రంప్‌నుంచి భరోసా లభించడంతో అమెరికాలో తమ సేవలు పునరుద్ధరణకు టిక్‌టాక్ శ్రీకారం చుట్టింది.

# యథేచ్ఛగా గ్రానైట్ బండలు అక్రమ రవాణా..!


**కుప్పం,తెలంగాణ దిశ :** కుప్పం మండలం గుడ్లనాయనిపల్లె పంచాయతీ ఊరినాయనికొత్తూరు వద్ద అనధికారికంగా గుట్టను చదును చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంనుంచి మొదలైన ఈ క్వారీయింగ్ ఇప్పుడూ కొనసాగుతోంది. ఇక్కడినుంచి క్వారీ బండలను తమిళనాడుకు తరలించడం నిత్యకృత్యంగా మారుతోంది. సమీప గ్రామస్థులు ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారు. దీంతో చివరకు గ్రామస్థులే నడుం బిగించారు. అక్రమ క్వారీ వద్ద రెండు లారీలకు గ్రానైట్ బండలు లోడ్ చేస్తుండగా గ్రామస్థులు దాడిచేసి అడ్డుకున్నారు. అందులో ఒక లారీకి అప్పటికే లోడ్ కాగా, ఇంకో లారీకి లోడింగ్ జరుగుతోంది. ఆ సమయంలో గ్రామస్థులు వెళ్లేసరికి డ్రైవర్లతోపాటు వారితో ఉన్న ఒకరిద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బెదిరించడానికి ప్రయత్నించారు. గ్రామస్థులు తిరగబడే సరికి, డ్రైవర్లు వాహనాలు వదిలి పారిపోయారు. పోలీసులకు సమాచారం ఇవ్వగానే వాళ్లు వచ్చి లోడింగ్ పూర్తయిన లారీని సీజ్ చేసి ఆర్టీసీ డిపో ఆవరణలో ఉంచారు. వీటిని పరిశీలించి పర్మిట్లు ఉందా లేదా, అక్రమమా సక్రమమగా తేల్చాల్సిన బాధ్యత మైనింగ్ అధికారులది. కుప్పం మండలంలోని కృష్ణదాసనపల్లె వద్ద అధికారంలో ఎవరు ఉన్నారన్నదానికి అతీతంగా ఎప్పటినుంచో గ్రానైట్ క్వారీ నడుస్తోంది. టీడీపీ ప్రభుత్వం వచ్చాక, అనుమతులు రద్దయ్యాయి. అయినా సరే, ఇక్కడినుంచి యథేచ్ఛగా గ్రానైట్ అక్రమంగా రవాణా అవుతున్నదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈనెల 7వ తేదీన పట్టుబడి వదిలేసిన గ్రానైట్ లారీ ఈ క్వారీనుంచే బయలుదేరిందన్న అనుమానాలను పలువురు ఇప్పటికీ వ్యక్తం చేస్తున్నారు. కుప్పం మండలం పైపాళ్యం గ్రామస్తుడు ఒకరి లారీని గ్రానైట్ రవాణాకు




వాడడంతోపాటు డ్రైవర్ కూడా అదే గ్రామానికి చెందినవాడు కావడం ఈ అనుమానాలకు ప్రధాన కారణం. ్టుబడ్డ లారీ ఊరినాయనిపల్లె కొత్తూరు గ్రామ సమీపంలో గల క్వారీవద్ద ఉన్నది. ఇక్కడ అసలు క్వారీకి ఇప్పుడు కాదుకదా, గతంలో ఎప్పుడూ అనుమతులు లేవు. ఈ క్వారీ విషయం, స్థానిక రెవెన్యూ, పోలీస్, చివరకు పలమనేరులో కార్యాలయంగల మైనింగ్ శాఖ అధికారులకు కూడా తెలుసు. అయినా చర్యలు లేవు. గ్రానైట్ లారీని రెడ్ హ్యాండెడ్‌గా గ్రామస్థులు పట్టుకుని, పోలీసులకు అప్పగించి 24 గంటలు గడిచినా పోలీసు, మైనింగ్ శాఖాధికారులు ఒకరిమీద ఒకరు చెప్పుకోవడం తప్ప, చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలను తావిస్తోంది. ఈ నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష రాజకీయాలు కలగలసిపోయిన ఒక వ్యవస్థ గ్రానైట్ అక్రమ రవాణాను శాసిస్తున్నదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. వెంటనే జిల్లా అధికార యంత్రాంగం కదిలి, గ్రానైట్ అక్రమ కార్యకలాపాలను అడ్డుకోకపోతే ప్రభుత్వంతోపాటు, అధికార పార్టీకి కూడా ప్రజల్లో చెడ్డపేరు వచ్చే ప్రమాదం ఉంది.

# అడవుల పరిరక్షణతో ఏనుగుల సంరక్షణ

కుప్పం,తెలంగాణ దిశ : అడవులను పరిరక్షించడం ద్వారా ఏనుగుల సంరక్షణ సాధ్యమవుతుందని కడా ప్రాజెక్టు ఆఫీసర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. కుప్పంలో ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో స్థానిక మండల సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వికాస్ మర్మత్ మాట్లాడుతూ ఏనుగులు సాధు జంతువులని, వాటిని కాపాడుకోవాలని అన్నారు. రామకుప్పం మండల పరిధిలోని ముద్దనపల్లె ఉన్నత పాఠశాల ఆవరణలో రామకుప్పం అటవీ డిప్యూటీ రేంజ్ అధికారి ధనుంజయుడు అటవీ సిబ్బంది, టీడీపీ నేతలతో కలిసి మొక్కలు నాటారు. ననియాల కౌండిన్య ఎలిఫెంట్ క్యాంపులో కుంకీ ఏనుగులు జయంత్, వినాయక్‌లకు స్నానపానాదులు చేయించి, ప్రత్యేక రంగులతో అలంకరించారు. వాటికి పూజలు చేసి, పండ్లు, ఫలహారాలు అందజేశారు. అటవీ సిబ్బంది ననియాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఏనుగుల కదలికలు, ఏనుగుల దాడి నుంచి తప్పించుకునే మెలకువలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఎఫ్‌ఆర్‌వో జయశంకర్‌తోపాటు డీఆర్వోలు, టీడీపీ ఎస్సీ




సెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, బీసీసెల్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మనోహర్, తెలుగు యువత మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, సీనియర్ నేతలు రామ్మూర్తి, జేయి, రఘు, నందీశ్వర్, నాగరాజు, సుబ్రహ్మణ్యంనాయుడు, మంజునాథ్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ అండర్ వరల్డ్ డాన్ శకం..?

ముంబై, : ముంబై అండర్ వరల్డ్ మళ్లీ యాక్టీవ్ అయింది. గతంలో ముంబై చీకటి సామ్రాజ్యాన్ని లీడ్ చేసిన డీ-కంపెనీ దాదాపు ఫేడవుటైపోవడంతో ఇప్పుడు కొత్త గ్యాంగ్ ఎంటరైంది. అండర్ వరల్డ్‌కి నయా దావూద్ వచ్చాడు. అతను ఉండేది జైల్లో.. కానీ జరిగే హత్యలు జరిగిపోతుంటాయి. కటకటాల్లో ఉండే ఏడు దేశాల్లో నెట్‌వర్క్ మెయింటేన్ చేస్తున్నాడు. ఫైనాన్స్ క్యాపిటల్‌ని గడగడలాడిస్తున్న ఈ కిల్లర్ ఎవరు? ఎక్కడి నుంచి వచ్చాడు..? దావూద్‌ని రీప్లేస్ చేయాల నుకుంటున్నాడా..? అతని హిట్ లీస్ట్‌లో ఇంకా ఎవరున్నారు..? ఇదే ఇప్పుడు పోలీసులను ముచ్చెమటలు పట్టిస్తోంది.గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్.. ఉత్తర భారతాన్ని వణికిస్తున్న కొత్త కటౌట్ ఇది. మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్ధిఖీ హత్యతో గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ పేరు దేశవ్యాప్తంగా మార్మోగుతోంది. గత కొన్నేళ్లుగా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్.. దేశంలో తీవ్ర అశాంతిని నెలకొల్పుతుండటంతో మరోసారి నైన్టీస్ దేశాన్ని వణికించిన అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం గుర్తుకు వస్తున్నాడు. దావూద్ ఇబ్రహీంకు చెందిన డీ-కంపెనీతో ఎన్‌ఐఏ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌ను పోల్చింది. చిన్న చిన్న నేరాలతో నెట్‌వర్క్‌ను విస్తరించిన దావూద్ ఇబ్రహీం లాగే లారెన్స్ బిష్ణోయ్ కూడా ఉగ్రవాద సిండికేట్‌గా పనిచేస్తున్నట్లు ఎన్‌ఐఏ అనుమానం. డ్రగ్స్ అక్రమ రవాణా, టార్గెట్ కిల్లింగ్స్, దోపిడీ రాకెట్ల ద్వారా దావూద్ ఇబ్రహీం తన నెట్‌వర్క్‌ను విస్తరించి.. ఆ తర్వాత పాకిస్థాన్ ఉగ్రవాదులతో కలిసి డీ-కంపెనీని ఏర్పాటు చేశాడు.

# కన్నడ మంత్రికి రన్యారావుతో లింక్..?



బెంగళూరు: బంగారాన్ని అక్రమంగా రవాణా చేస్తూ నటి రన్యా రావు అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. ఈ అంశంపై కర్ణాటక అసెంబ్లీలో రచ్చ రచ్చ జరిగింది. అక్రమ రవాణా కేసులో అరెస్ట్ అయిన నటి రన్యా రావు వెనుక ఉన్న మంత్రి ఎవరే విషయంపై తీవ్ర కలకలం రేగింది. ఆమె వెనుక ఉన్నది ఎవరో బహిర్గతం చేయాలంటూ సభలోని బీజేపీ ఎమ్మెల్యేలు పట్టుబట్టడంతో కొద్ది సేపు తీవ్ర గందరగోళం చోటు చేసుకుంది. ఈ కేసు గురించి తనకు ఎటువంటి సమాచారం లేదని హోంమంత్రి చెప్పడంతో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు మండిపడ్డారు. నటి రన్యా రావు కేసుకు సంబంధించి, బంగారం స్మగ్లింగ్ వెనుక ఉన్న మంత్రి ఎవరు? అని బీజేపీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ సభలో ప్రశ్న లేవనెత్తారు. అయితే ఈ ప్రశ్నకు సమాధానం చెబుతూ.. హోంమంత్రి పరమేశ్వర తనకు తెలియదని చెప్పడంతో ఒక్కసారిగా సభలో వివాదం చెలరేగింది.అయితే సభలో మంత్రి ఎవరో చెప్పకపోయినా.. బంగారం అక్రమ రవాణా వెనుక బడా నేత ఉన్నట్లు సమాచారం. ఆదివారం ఈ కేసు వెనుక మంత్రి ఉన్నారని బీజేపీ నేతలు తీవ్ర ఆరోపణలు చేశారు. కూడా ఇదే అంశం సభలో లేవనెత్తడంతో గందరగోళం చోటు చేసుకుంది. అసెంబ్లీ జీరో అవర్ సందర్భంగా ఈ అంశాన్ని లేవనెత్తిన కర్కల బీజేపీ ఎమ్మెల్యే సునీల్ కుమార్, బంగారం అక్రమ రవాణాకు పోలీసులే ప్రోటోకాల్ ఇచ్చారని అనుమానం వ్యక్తం చేశారు. దీని వెనుక మంత్రి ఎవరో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. దీనిపై హోంమంత్రి పరమేశ్వర్ స్పందిస్తూ.. ఇది కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తుందని అన్నారు.ఈ కేసు గురించి మీకు ఎంత తెలుసో, తమకూ అంతే తెలుసని అన్నారు. ఆ మంత్రి ఎవరో సీబీఐ కనుక్కోవాలని ఆయన అన్నారు. మంత్రి సమాధానంతో సంతృప్తి చెందని సునీల్ కుమార్ దీన్ని మీరే సీబీఐకి ఇవ్వండి అని డిమాండ్ చేశారు. ఈ కేసులో చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని మంత్రి వెల్లడించారు. కానీ, బీజేపీ ఎమ్మెల్యే మాత్రం.. ఎవరినో రక్షించడానికి ఇదంతా జరుగుతుందంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. స్పీకర్ ఖాదర్ జోక్యం చేసుకుని కేసు దర్యాప్తు జరుగుతోందని చెప్పారు. అయితే ఈ కేసులో రన్యా రావు వెనుక ఒక మంత్రి ఉండి బంగారం అక్రమ రవాణా చేయించారనే ఆరోపణలు కర్ణాటక ప్రభుత్వానికి తలనొప్పిగా మారాయి.

# చుట్టూ నీరు.. ఆగని కన్నీరు!

**కుప్పం,,తెలంగాణ దిశ :** ప్రభుత్వాలు మారినా తాడిమర్రి మండలంలోని కొన్ని గ్రామాల దుస్థితి మాత్రం మారడంలేదు.ఏళ్ల తరబడి నీటి కష్టాలు తీరడంలేదు. రామాపురం, చిల్లవారిపల్లి, చిల్లకొండాయపల్లి గ్రామాల్లో నీటిఎద్దడి నివారణకు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఒక రోజు, రెండ్రోజులు కాదు ఏకంగా 4 నెలలుగా ఆయా గ్రామాలకు నీటి ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారంటే సమస్యకు శాశ్వత పరిష్కారంపై చూపుతన్న నిర్లక్ష్యం ఇట్టే అర్థమవుతోంది. ఎన్నికల్లో ప్రచారానికి వచ్చిన సందర్భంగా తప్పకుండా తాగునీరందిస్తామని హామీ ఇచ్చిన నాయకులు అనంతరం ముఖం చాటేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. కూలీ పనులను సైతం మానుకుని ట్యాంకరు నీటి కోసం ఎదురుచూస్తున్నారంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మండల సరిహద్దులో చిత్రావతి జలాశయం ఉంది. ఈ జలాశయం మండలంలోని పలు గ్రామాల చుట్టూ విస్తరించింది. అయినా గ్రామాలకు తాగునీరందని దుస్థితి నెలకొంది. జలాశయంలో పది టీఎంసీల నీటిని నిల్వ చేసినప్పుడు కూడా పరిసర గ్రామాల్లో దాహం కేకలే వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వంద కి.మీ. దూరంలో ఉన్న గ్రామాలకు చిత్రావతి జలాశయం నుంచి సత్యసాయి తాగునీటి సంస్థ ప్రజలకు తాగునీరు సరఫరా



చేస్తోంది. దగ్గరలో ఉన్న గ్రామాలకు మాత్రం దాహార్తి తీర్చట్లేదు. చిల్లవారిపల్లి, చిల్లకొండాయపల్లి గ్రామాలు చిత్రావతి జలాశయానికి కేవలం పది కి.మీ. దూరంలోనే ఉన్నాయి. రామాపురంలో తాగునీటి సమస్యతో ఆ గ్రామం ప్రజలు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. 6, 7 నెలలుగా నాయకులు రోజూ 5 ట్యాంకర్లు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తున్నారు. గత మూడేళ్లుగా ప్రతి మండల సర్వసభ్య సమావేశంలో ఆ గ్రామాల్లో తాగునీటి కష్టాలు - ప్రజలు పడుతున్న ఇబ్బందులను సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది.

# ఉపాధ్యాయుల సర్దుబాటుకు శ్రీకారం



అనంతపురం:ప్రభుత్వ పాఠశాలల్లో అదనంగా ఉన్న ఉపాధ్యాయులను గుర్తించి కొరత ఉన్నచోట సర్దుబాటు చేయాలని విద్యాశాఖ కమిషనర్ నుంచి మార్గదర్శకాలు వచ్చాయి. ఈ ప్రక్రియ ఆరంభమైంది. కొన్నిచోట్ల విద్యార్థుల సంఖ్య తక్కువగా, ఉపాధ్యాయులు ఎక్కువగా, మరికొన్నిచోట్ల విద్యార్థులు ఎక్కువగా ఉన్నా.. టీచర్లు తగినంతమంది లేరు. దీంతో ఆయా పాఠశాలల్లో బోధన కుంటుపడుతోంది. కొన్ని సబ్జెక్టులకు కనీసం ఒకరూ కూడా బోధించేవారు లేరు. సమస్య పరిష్కరించడానికి విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది. కొందరు సర్‌ప్లస్‌లో ఉన్నా విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలలకు వెళ్లడానికి నిరాకరిస్తున్నారు. అధికారులపై వివిధ రకాల ఒత్తిళ్లు చేసి అక్కడే ఉంటామంటున్నారు. గత సంవత్సరం రాజకీయ ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గి సర్దుబాటు సక్రమంగా జరగలేదు. సర్దుబాటు చేసినా ఉపాధ్యాయులు పాత పాఠశాలల్లోనే కొనసాగారు. కొన్నిచోట్ల ఉపాధ్యాయుల కొరత ఉంది. ఆయా పాఠశాలల్లో 585 మంది అవసరం ఉంది. మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేసినా 483 మంది అదనంగా ఉంటారు. ఈనెల 9వ తేదీ వరకూ విద్యార్థుల నమోదు సంఖ్యను ఆధారంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి ప్రకారం అదనంగా ఉన్నవారిని గుర్తించారు. వారిని మండలస్థాయిలో సర్దుబాటు చేస్తారు. అక్కడా అదనంగా ఉంటే వారిని డివిజన్‌స్థాయిలో సర్దుబాటు చేస్తారు. డివిజన్ స్థాయిలో కూడా మిగిలితే జిల్లాస్థాయిలో సర్దుబాటు చేస్తారు. అయితే కొన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్‌లను ఎస్జీటీలుగా నమోదు చేశారు.

# ఎరువులకు బారులు తప్పేనా?

అమరావతి: నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులు నిండటంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఖరీఫ్ సీజన్ పంటలకు సాగునీటి భరోసా లభించింది. కాలువలకు నీటిని విడుదల చేస్తుండటంతో రైతులు పంటల సాగులో నిమగ్నమయ్యారు. పల్నాడులో ఇప్పటికే పత్తి పంట సాగు చేయగా వరి పంట ఇప్పుడు సాగు చేస్తున్నారు. మొక్కజొన్న సాగు ఊపందుకుంది. మిర్చి నారు సిద్ధం చేసుకున్న రైతులు నాట్లు వేస్తున్నారు. కృష్ణా పశ్చిమ డెల్టాలో వరి పంట ఇప్పటికే సాగయింది. సకాలంలో డెల్టాలో కాలువలకు నీటిని విడుదల చేయడంతో రైతులు వెద పద్ధతిలో సాగు చేశారు. ఆయకట్టు చివరి భూముల రైతులు లోతట్టు ప్రాంతంలో నాట్లు వేశారు. సాగర్, డెల్టా కాలువల కింద పూర్తి ఆయకట్టు సాగులోకి వస్తుండటంతో ఎరువుల వినియోగం పెరుగుతుంది. అందుకు అనుగుణంగా వ్యవసాయశాఖ అవసరమైన ఎరువులను అందుబాటులోకి తేవడానికి వెంటనే అప్రమత్తం కావాలి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఎరువుల దుకాణాల వద్ద జనం బారులుదీరే పరిస్థితి తలెత్తకుండా యంత్రాంగం మేల్కొనాల్సి ఉంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో వరి, మిర్చి,




పత్తి, మొక్కజొన్న పంటలు ఎక్కువగా సాగు చేస్తారు. పంట సాగు చేసి 20 నుంచి 60 రోజుల వ్యవధిలో డీఏపీ చల్లుతారు. ఏ పంటకైనా డీఏపీతోపాటు కొంత యూరియా కలిపి వాడతారు.

# ఎల్లప్పుడూ యంగ్‌గానే కనిపించాలా..?

సినిమా తారలను చూస్తే ఎల్లప్పుడూ వారు యంగ్‌గానే కనిపిస్తారు. 50 సంవత్సరాల వయస్సులోనూ యవ్వనంగానే కనిపిస్తారు. అయితే వారు అలా కనిపించేందుకు ఎంతో కష్టపడతారన్న విషయం మాత్రం చాలా మందికి తెలియదు. వారు సినిమాల్లో నటించాలి కనుక యంగ్‌గా ఉంటేనే బాగుంటుంది. కనుక ఆ ఫిజిక్‌ను మెయింటెయిన్ చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తుంటారు. వ్యాయామం చేయడంతోపాటు స్ట్రిక్ట్ డైట్‌ను కూడా పాటిస్తుంటారు. అయితే మన శరీరాన్ని యవ్వనంగా ఉంచడంలో ఆహారం ముఖ్య పాత్ర పోషిస్తుందని చెప్పవచ్చు. మనం తీసుకునే ఆహారాలే మన శరీనాన్ని యవ్వనంగా ఉంచుతాయి. అనారోగ్యాల బారిన పడకుండా చూస్తాయి. ఈ క్రమంలోనే నిత్యం పలు ఆహారాలను తినడం వల్ల ఎల్లప్పుడూ యంగ్‌గా ఉండేలా చూసుకోవచ్చు. దీంతో అందరి దృష్టి మీపైనే పడుతుంది. ఇక అందుకు ఏయే ఆహారాలను తినాలో ఇప్పుడు తెలుసుకుందాం.

**గ్రీన్ టీ..:** రోజూ 2 నుంచి 3 కప్పుల గ్రీన్ టీని సేవిస్తుండడం వల్ల ఎల్లప్పుడూ చర్మాన్ని యవ్వనంగా ఉంచుకోవచ్చు. గ్రీన్ టీలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా ఇందులో పాలిఫినాల్స్ ఉంటాయి. ఇవి వృద్ధాప్య ఛాయలను తగ్గిస్తాయి. ముఖంపై ఉండే ముడతలు, మచ్చలు పోయేలా చేస్తాయి. దీంతోపాటు తీవ్రమైన వ్యాధులు రాకుండా చూస్తాయి. కనుక గ్రీన్ టీని రోజూ తాగుతుంటే ఆరోగ్య ప్రయోజనాలు కలగడమే కాకుండా శరీరాన్ని ఎల్లప్పుడూ యవ్వనంగా ఉంచుకోవచ్చు. చర్మం కాంతివం తంగా మారి మెరుస్తుంది. అలాగే వారంలో కనీసం 2 నుంచి 3 సార్లు చేపలను ఆహారంలో భాగం చేసుకోవాలి. సాల్మన్ వంటి చేపల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, ప్రోటీన్లు, సెలీనియం, ఆస్టాజాం తిన్ వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి మన శరీరంలో కొల్లాజెన్‌ను ఉత్పత్తి చేసేందుకు దోహదపడతాయి. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. కనుక చేపలను తరచూ తింటుండాలి.

**డార్క్ చాకొలెట్లు..:** డార్క్ చాకొలెట్లను తినడం వల్ల కూడా చర్మం



ఎల్లప్పుడూ యవ్వనంగా ఉంటుంది. వీటిల్లో ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉంటాయి. ఇవి సూర్యుని నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల బారి నుంచి చర్మాన్ని సంరక్షిస్తాయి. దీంతో చర్మం యవ్వనంగా కనిపిస్తుంది. వృద్ధాప్య ఛాయలు అంత త్వరగా రావు. అవిసె గింజలలో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా ఈ గింజల్లో ఆల్ఫా-లినోలీనిక్ యాసిడ్ ఉంటుంది. ఇది చర్మం పొరలను సంరక్షిస్తుంది. చర్మం ఎల్లప్పుడూ తేమగా ఉండేలా చేస్తుంది. దీంతో చర్మానికి సహజసిద్ధమైన నిగారింపు వస్తుంది. కనుక అవిసె గింజలను కూడా రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాలి. **దానిమ్మ పండ్లు..:** చూసేందుకు ఎరుపు రంగులో దానిమ్మ పండ్లు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఇవంటే చాలా మందికి ఇష్టమే. అయితే దానిమ్మ పండును రోజూ ఒకటి తింటున్నా చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. దానిమ్మ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి చర్మానికి మరమ్మత్తులు చేస్తాయి. దీంతో చర్మ కణాలు పునరుత్తేజం చెందుతాయి. చర్మం యవ్వనంగా మారి కాంతివంతంగా కనిపిస్తుంది.

రోజూ దానిమ్మ పండును తినడం ఇష్టం లేకపోతే దాని జ్యూస్‌ను అయినా తాగవచ్చు. దీంతో చర్మాన్ని యంగ్‌గా ఉంచుకోవచ్చు. అలాగే చెర్రీలను ఆహారంలో భాగం చేసుకున్నా కూడా చర్మం ఆరోగ్యంగా, సురక్షితంగా ఉంటుంది. చెర్రీ పండ్లలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి కొల్లాజెన్ ఉత్పత్తికి దోహదం చేస్తాయి. దీంతో చర్మం సురక్షితంగా ఉంటుంది. యవ్వనంగా కనిపిస్తుంది. ఇలా పలు రకాల ఆహారాలను తింటే చర్మాన్ని ఎల్లప్పుడూ యంగ్‌గా కనిపించేలా చేయవచ్చు.

# ట్రిపుల్‌ఆర్ నిర్మాణం మరింత ఆలస్యం..!



## పరిహారం పెంచితేనే పనులు ముందుకు
## భూసేకరణ పూర్తయ్యేవరకూ ఆగినట్టే
## అందుకే ఏజెన్సీల ఖరారులో జాప్యం

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ప్రాంతీయ రింగురోడ్డు (ట్రిపుల్‌ఆర్) ఉత్తర భాగం నిర్మా ణం మరింత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తున్నది. రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండటం,భూసేకరణ ప్రక్రియ ఇంకా పూర్త కాకపోవడంతో కేంద్ర ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది. అ ందువల్లేఏజెన్సీలను ఖరారు చేయడంలో జాప్యం జరుగుతోంది. ముఖ్య మంత్రితోపాటు రోడ్లు,భవనాల శాఖ మంత్రి ఇప్పటికే పలుమా ర్లు జాతీయ రహదారుల శాఖ మంత్రిని కలిసి విజ్ఞప్తి చేసినా ఎలాంటి పురోగతిలేకపోవడమే ఇందుకు నిదర్శనం. ట్రిపుల్‌ఆర్‌ను రెండు దశల్లో అభివృద్ధి చేయాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హె చ్ఏఐ) నిర్ణయించిన విషయం తెలిసిందే.

ఇందులో తొలుత ఉత్తర భాగాన్ని నిర్మించేందుకు టెండర్ల ప్రక్రియ చేపట్టినప్పటికీ దాఖలైన బిడ్లను మాత్రం తెరవడంలేదు. జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖతో పాటు పీపీపీ అప్రైజల్ కమిటీ నుంచి గ్రీన్ సిగ్నల్ రాకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తున్నది. దీంతో బిడ్లు తెరిచే గడువును ఇప్పటికే నాలుగుసార్లు వాయిదా వేశారు. భూసేకరణపైప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవడం,పలుచోట్ల కోర్టు స్టేఉత్తర్వులు ఉండటంతో టెండర్ల విషయంలో తొందరపడరాదని కే ంద్రం నిర్ణయించినట్టు అధికారవర్గాలు చెప్తున్నాయి.

బిడ్లుతెరిస్తే ఎంపికైన ఏజెన్సీకి పనులు కేటాయించాల్సివస్తుందని, ఆ తర్వాత ఏ కారణంచేతనైనా అవి ముందుకు సాగకపోతే ఏజెన్సీలు పనులను నిలిపివేసి న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతోపాటు భారీగా నష్ట పరిహారాన్ని డిమాండ్ చేస్తాయని, అందుకే అసలు బిడ్లే తెరవకుండాఉంటేఏతలనొప్పీ ఉండదని, భూసేకరణ పూర్తయ్యాకే పనులు చేపడదామని ఎన్‌హెచ్ఏఐ అధికారులు భావిస్తున్నారు.దీనికి హైదరాబాద్–విజయవాడ రహదారిని ఉదాహరణగా చూపుతు న్నారు. ఈ రహదారిని 8లేన్లుగా విస్తరించాలనిఒప్పందంలో ఉన్నప్ప టికీ పనులు చేపట్టిన ఏజెన్సీ రాష్ట్ర విభజన వల్ల తనకు టోల్ వసూలు కావడంలేదనే కారణంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించింది.పనులు నిర్వహించకపోవడంతోదాదాపు పదేళ్లపాటు ఈరహదారి విస్తరణకు నోచుకోలేదు. తొందరపడిట్రిపుల్‌ఆర్ విషయంలో కూడాఏజెన్సీని ఎంపికచేస్తే ఇలాగే జరుగుతుందని ఎన్‌హెచ్ఏఐ అధికారులు భావిస్తున్నట్టు సమాచారం.

ఎకరం రూ.50 లక్షలు పలికే భూమికి రూ.6 లక్షల పరిహారమా?: ట్రిపుల్‌ఆర్ నిర్మాణం కోసం భూములిచ్చే రైతులకు నష్టపరిహారాన్ని చాలా తక్కువగా నిర్ణయించడంతో భూసేకరణ ముందుకు సాగడం లేదు.ప్రస్తుతం ఆ ప్రాంతంలో మార్కెట్ విలువ ప్రకారం ఎకరం రూ.2 లక్షలు, బహిరంగ మార్కెట్ ధర ప్రకారం రూ.50 లక్షలకుపైగా పలుకుతున్నది. కానీ, రూ.6 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో భూములిచ్చేందుకు రైతులు ససేమిరా అంటున్నారు. మొత్తం 4,682 ఎకరాల్లో 3,261 ఎకరాలకు అవార్డ్ పాస్ చేసినప్పటికీ ఇంకా నష్టపరిహారాన్ని చెల్లించలేదు.

అందులో దాదాపు 200 ఎకరాల అటవీభూమి ఉండటంతో ఆభూమికి బదులుగా అటవీశాఖకు మరో చోట భూమి ఇచ్చేందుకు ప్రభుత్వం సంసిద్ధతవ్యక్తం చేసింది. మిగిలిన భూముల విషయంలో రైతుల వ్యతిరేకత, కోర్టు కేసులు అడ్డంకిగా ఉన్నాయి.

232 ఎకరాలపై కోర్టు కేసులు ఉండగా.. 1,107 ఎకరాలు ఆర్బిట్రేషన్ వద్ద విచారణలో ఉన్నాయి. పరిహారం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి: ట్రిపుల్‌ఆర్‌ను నిర్మించే జిల్లాల్లో ఇప్పటికే భూముల ధరలను పెంచిన ప్రభుత్వం.. భూసేకరణ సమస్యల పరిష్కారానికి కలెక్టర్ల నేతృత్వంలో ఆర్బిట్రేషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ భూములు పట్టణానికి దగ్గరగా ఉన్నాయా,వాటిలో ఏటా ఎన్ని పంటలు పండుతాయి, ప్రస్తుతం ఆ భూముల ధరలు ఎలా ఉన్నాయి.

భవిష్యత్తులో వాటి విలువ ఏ మేరకు పెరగవచ్చన్న అంశాల ఆధారంగా ఆర్బిట్రేషన్ ఖరారు చేసిన ధరలనుఎన్‌హెచ్ఏఐ చెల్లించాల్సి ఉం టుంది. భూసేకరణ చట్టం ప్రకారం భూములు కోల్పోతున్నవారికి గ్రామీణ ప్రాంతాల్లో అయితే మార్కెట్ ధరకు కనీసం రెండు రెట్లు, పట్టణ ప్రాంతాల్లో అయితే నాలుగు రెట్లు అధికంగా నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలో మార్కెట్ ధరప్రకారం నష్టపరి హారంచెల్లిస్తే భూసేకరణ సాధ్యంకాదని నిర్ణయానికొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం..

రైతులకు సాధ్యమైనంత ఎక్కువ నష్టపరిహారం చెల్లించాలని కేంద్రాన్ని కోరింది. గతంలోఎన్‌టీపీసీ చెల్లించిన విధంగా ఎకరాకు కనీసం రూ.30 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరినట్టువిశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కానీ, ఒకచోట అధికంగా చెల్లిస్తే ప్రతిచోటా ఇదే విధమైన డిమాండ్లు వస్తాయని, రోడ్ల నిర్మాణం ముందుకుసాగే వీలుం డదని ఎన్‌హెచ్ఏఐ భావిస్తున్నట్టు తెలిసింది.

# ‘ఉపాధి’ బకాయి

## గ్రామీణ పేదల పొట్టగొడుతున్న కేంద్రం - ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సింది రూ.2,030 కోట్లు



న్యూఢిల్లీ:మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ ఆర్ఇజి) కింద ఈ ఏడాది మార్చి 21 నాటికి కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రాలకు రావలసిన బకాయి అక్షరాల రూ.26 వేలకోట్లు. అందులో ఆంధ్రప్రదేశ్‌కు రావలసిన బకాయి రూ.2,030 కోట్లు కాగా, కేరళకు రావాల్సినది రూ.1,055.81 కోట్లు. రాజ్యసభలో సిపిఎం ఎంపి వి.సదాశివన్‌కు గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఇచ్చిన సమాధానంలో ఈ విషయం వెల్లడైంది. ఈ మొత్తంలో కార్మికుల వేతనాల కింద రూ.1,5277.0 కోట్లు, సామాగ్రి, పాలనా పరమైన ఖర్చుల కింద రూ.10,820.23 కోట్లు ఇవ్వాల్సి వుంది. బకాయి మొత్తాల గురించి ఎప్పుడు ప్రశ్నించినా, రాష్ట్రాలు ఇంకా పద్దులు సమర్పించలేదని సాకులు చెబుతూ కేంద్ర ప్రభుత్వం ఈ విషయానికి సమాధానం ఇవ్వకుండా తప్పించుకుంటోంది.

ఈ సమస్యను పరిష్కరించడానికి బదులుగా కేంద్రం చెల్లింపులను నిలుపు చేస్తోంది. దీనివల్ల గ్రామీణ కార్మికుల జీవనోపాధి దెబ్బతింటోంది. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మొత్తం రాష్ట్రాలకు కేంద్రం చెల్లించాల్సిన బకాయిలు 26,097.23 కోట్లుగా వుంది. బిజెపి పాలిత ‘డబుల్ ఇంజన్’ రాష్ట్రాల్లో కూడా పెద్ద మొత్తాల్లోనే బకాయిలు పెండింగ్‌లో వున్నాయి. ఆ రాష్ట్రాలు కూడా ఇంకా పద్దులు అందచేయలేదనే వాదననే కేంద్ర ప్రభుత్వం చేస్తుందా లేదా అన్నదే ఇక్కడ కీలకమైన ప్రశ్న.

ఇంత పెద్ద మొత్తాలను విడుదల చేయడంలో ఇలా జాప్యం జరగడం వల్ల ఉపాధి కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లింపులు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి ఫలితంగా గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టులకుఆటంకం కలుగుతోంది. నిరుపేదలైన గ్రామీణ కూలీల వేతనాలను ఇలా నిలుపుచేయడమనేది పెద్ద సవాలుగా మారుతోంది. భారతదేశం ఆర్థిక అగ్రశక్తిగా ఆవిర్భవిస్తోందని కేంద్ర ప్రభుత్వం ఒక పక్క గొప్పలు చెప్పుకుంటోంది. కానీ, మరోపక్క కోట్లమంది పేద కూలీలకు జీవనాడిగా వున్న గ్రామీణ ఉపాధి హామీపనులకు అవసరమైన నిధులను కూడా విడుదల చేయడంలో విఫలమవుతోంది. ‘ఉపాధి’ చట్టాన్ని దెబ్బ తీయాలనే ఇలా వేతనాల చెల్లింపులను ఉద్దేశ్యపూర్వకంగా మోడీ ప్రభుత్వం జాప్యం చేస్తోంది. మీడియా ఈ అంశంపై తీవ్రంగా దృష్టి సారించి, దీనికి ఇవ్వాల్సిన ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపి సదాశివన్ కోరారు.

# రెండు కుండల కంటే ఎక్కువ నీరు తీసుకుంటే..
# భారీ మూల్యం చెల్లించాల్సిందే..!



పూణె : తాగునీరు సమస్త జీవకోటికి ప్రధాన ఆధారం. ఆనీరే లేకపోతే భవిష్యత్తు తరాల మనుగడ ప్రశ్నార్థకమే. ఈక్రమంలోనే నీటి వృథాను అరికట్టేందుకు ఓ గ్రామం వినూత్న ఆలోచన చేసింది. రెండు కుండల కంటే ఎక్కువ నీరు తీసుకెళ్తే భారీగా ఫైన్ చెల్లించాల్సిందేనట. అయితే, ఆ రూల్స్ పెట్టడానికి కారణాలు ఏంటి, అక్కడున్న పరిస్థితుల గురించి తెలుసుకుందాం. వివరాల్లోకి వెళితే..పూణే నుంచి 71కిలోమీటర్ల దూరంలో ఉన్న పర్సుల్ గ్రామంలో స్థానిక బావి నుండి రెండు కుండల కంటే ఎక్కువ నీరు తీసుకుంటే ఎవరైనా సరే100 జరిమానా చెల్లించాలి. ఎందుకంటే ఆ గ్రామంలో తీవ్రనీటి కొరత ఉంది.

అలాగే ఆ ప్రాతంలో ఉన్న బావిలో వాటర్‌ను తోడి తోడిలోతు ఎక్కువగా కావడం వల్ల గత రెండు నెలలుగా.. గ్రామస్తులు ఆ లోతైన బావి నుండి నీ టిని తీసుకురావడానికి ఇబ్బంది పడుతున్నారు. అయితే ఆ గ్రామంలో రెండు బావులు ఉండగా.. ఒక బావి నుండి తీసిన నీటిని గృహ అవసరాలకు ఉపయోగిస్తుండగా రెండో బావి నుంచి తీసిన నీటిని తాగునీటి అవసరాలకు ఉపయోగిస్తున్నారు. ఇక సమ్మర్ స్టార్టింగ్‌లోనే తాగునీటి బావిలో నీటి నిల్వ బాగా తగ్గింది.

దీంతో ముందు జాగ్రత్తగా ఎవరూ కూడా ఆ ఆంక్షలను ఉల్లంఘించకుండా చూసుకోవడానికి గ్రామస్తులు ఉదయం 7 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు తాగునీటి బావిని జాగ్రత్తగా నిఘా వేస్తున్నారు. అంతేకాకుండా, ప్రభుత్వం ‘జల్ జీవన్ మిషన్’ అమలు చేసినప్పటికీ పర్సుల్‌కు సరైన నీటి సరఫరా అందకపోవడంతో గ్రామస్తులు నీటి కోసం చాలా దూరం ప్రయాణించాల్సి వస్తోంది.

దీంతో గ్రామంలో కరువు లాంటి పరిస్థితిని నివారించడానికి గ్రామ పంచాయతీ ఈ చర్యలు ప్రారంభించింది. ఇక పర్సుల్ డిప్యూటీ సర్పంచ్ సరికా బాలాసాహెబ్ షిండే మాట్లాడుతూ.. ‘గ్రామంలో తాగునీరు, గృహ నీటి కొరత ఉంది. ‘జల్ జీవన్ మిషన్’ పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి, అందుకే మేము అలాంటి చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. అంతేకాకుండా గ్రామస్తులు తమ పశువులను తాగునీటి కోసం రోజూ దాదాపు కిలోమీటరు దూరం తీసుకెళ్లాల్సి వస్తుంది. దీంతో నీటి వృథాను నివారించడానికి జరిమానా విధించడానికి గ్రామస్తులు అంగీకరించారు. ఇది గ్రామస్తులలో క్రమశిక్షణను తీసుకువస్తుంది మరియు వారు నీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా వాడుకుంటారు’ అని ఆమె చెప్పుకొచ్చారు.

# ఉచిత శిక్షణ.. ఉపాధికి నిచ్చిన

**కల్లూరు,తెలంగాణ దిశ :**వివిధ అంశాల్లో తీర్చిదునిస్తోంది. శిక్షణతో సరిపెట్టక అర్హులైనవా రికి రుణాలిచ్చి తమ కాళ్లపై తాము నిలబడేలా తీర్చిదిద్దుతోంది. ఇప్పటికే వేలాది మంది శిక్షణ తీసుకుని స్వయం ఉపాధి సాధించడం విశేషం. కర్నూలు నగరంలో కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థను 2003లో ప్రారంభించారు. అప్పటినుంచి గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు నిరంతరం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 10,13,30 రోజులపాటు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. ఈ సమయంలో వారికి ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తారు. ప్రతి నెలా ఏదో ఒక రంగంలో తర్ఫీదు ఇస్తుంటారు. యువతలో నైపుణ్యా లను వృద్ధి చేసి స్వయం ఉపాధి కల్పించడమే సంస్థ ముఖ్య ఉద్దేశం. సంస్థ ప్రారంభించినప్పటి నుంచి నేటివరకు 8,788 మందికి శిక్షణ ఇచ్చారు. ఇందులో పురుషులు 2,291 మంది,మహిళలు 6,497 మంది ఉన్నారు. 2,401మందికి బ్యాంకు రుణ సదుపాయం కల్పించారు. పురు షులకు ద్విచక్రవాహన మరమ్మతులు, సర్వీసింగ్, చరవాణుల రిపేరు, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, ఎలక్ట్రికల్ హోం వైరింగ్, ప్లంబింగ్, శానిటరీ, ఎలక్ట్రికల్ మోటారు రీవైండింగ్, టైలరింగ్, డ్రస్ డిజైనింగ్ ఫర్ మెన్, సీసీటీవీ కెమెరా ఇన్‌స్టలేషన్ సర్వీసింగ్, కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్, పాడిపరిశ్రమ, వర్మీ కంపోస్టు తయారీ, గొర్రెల పెంపకం తదితర వాటిపై శిక్షణ ఇస్తారు. మహిళలకు టైలరింగ్, డ్రస్ డిజైనింగ్, బ్యూటీషియన్, పెళ్లికుమార్తె మేకప్, మెహందీ వర్క్, జ్యూట్ బ్యాగుల తయారీ, మగ్గం, ఫ్యాబ్రిక్, పెయింటింగ్ తదితర వాటిల్లో శిక్షణ ఉంటుంది. కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఆయా వృత్తిలో శిక్షణ పొందాలంటే



ముందుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఏఏ రంగాలలో శిక్షణ ఇస్తారో సంస్థ ప్రతినిధులు ముందుగా పత్రికా ప్రకటనల ద్వారా, గ్రామాల్లో పొదుపు సంఘాల ద్వారా, ఆయా ప్రభుత్వ శాఖలు, సామాజిక మాధ్య మాల ద్వారా సమాచారం ఇస్తారు. మరిన్ని వివరాలకు కల్లూరు తహసీల్దారు కార్యాలయం సమీపంలోని సంస్థ కార్యాలయంలో ప్రతినిధులను సంప్రదించవచ్చు. సంస్థలో నిరంతరం శిక్షణ కార్యక్రమాలు జరుగుతుంటాయి. తూతూమంత్రంగాకాక వృత్తిపై పట్టు సాధించేలా ఉంటుంది. ప్రాక్టికల్స్ సైతం నిర్వహిస్తారు. అందులో ఉత్తీర్ణత సాధిస్తే ధ్రువపత్రం ఇస్తారు. దీనిద్వారా బ్యాంకుల నుంచి రుణం పొంది స్వయం ఉపాధిలో రాణించేందుకు అవకాశముంటుంది. ఆసక్తి కలిగిన వారికి రుణాలు మంజూరు చేయించి ఆర్థిక తోడ్పాటు అందిస్తు ంటారు. దీంతోపాటు శిక్షణ పూర్తైన తర్వాత యువతకు.. ఆయా వృత్తులకు సంబంధించిన కిట్లను సైతం ఉచితంగా అందజేస్తున్నారు.

# సిక్కోలులో అన్యమత ప్రచారం కలకలం..!

శ్రీకాకుళం: శ్రీకాకుళం జిల్లాలో హిందూ దేవాలయాల గోడలపై అన్యమత ప్రచారం, అన్య మతాలకు చెందిన గుర్తులు కనిపించడం దుమారం రేపుతోంది. జలుమూరు మండలం కామేశ్వర పేట, కాముడు పేట, ఎలమంచిలి గ్రామాల్లో ఆలయాలతో పాటు ఇండ్ల గోడలపై శిలువ గుర్తులు, క్రైస్తవ సూక్తులు రాయడం కలకలం రేపుతోంది. మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు కొందరు ఈ పిచ్చి పనులకు పాల్పడ్డారని హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.300 ఏళ్ల చరిత్ర ఉన్న ఎలమంచిలిలోని ఎండల మల్లిఖార్జునస్వామి ఆలయంతో పాటు సమీప గ్రామాల్లోని హనుమాన్ ఆలయాలపై క్రైస్తవ మతానికి సంబంధించిన రాతలు, శిలువ గుర్తులు దర్శనమిచ్చాయి. ఎండల మల్లికార్జున స్వామి ఆలయానికి చేరుకున్న సాధుపరిషత్ అధ్యక్షులు శ్రీనివాసానంద సరస్వతి, ప్రతినిధులు ఈ దారుణంపై మండిపడుతున్నారు. కొందరు ఉద్దేశపూర్వకంగానే మతాల మధ్య చిచ్చు రేపుతున్నారని.. వారిని అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు ఆలయ గోడలపై ఉన్న అన్యమతాలకు చెందిన గుర్తులు, రాతలు చెరిపివేసే ప్రయత్నం చేస్తున్నారు. కేసు దర్యాప్తు చేయకుండా ఆలయాలపై పిచ్చి రాతలు, గీతలను ఎలా చెరిపేస్తారు అంటూ అడ్డుకున్న గ్రామస్తులు, విహెచ్పి, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు పోలీసులను అడ్డుకున్నారు. దాంతో ఎలమంచిలి గ్రామంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉగాది పండుగ రోజున ఈ ఘటన చోటుచేసుకోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పని చేసిన వారిని గుర్తించి తక్షణమే చట్టప్రకారం వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రంగంలోకి దిగిన క్లూస్ టీం ఆధారాలను సేకరించింది

# శిరోముండనం చేసుకున్న ఆశా వర్కర్లు

తిరువనంతపురం: కేరళలో ఆశా వర్కర్లు తమ నిరసనను కొత్త స్థాయికి తీసుకెళ్లారు. తిరువనంతపురంలోని సెక్రటేరియేట్ ముందు ఇవాళ వాళ్లు శిరోముండనం చేసుకున్నారు. ప్రభుత్వ నిర్లిప్తతను ఖండిస్తూ జుట్టును కత్తిరించుకున్నారు. రోజువారి గౌరవ వేతనాన్ని పెంచాలని, పోస్టు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరుతూ ఆశా వర్కర్లు ధర్నా చేస్తున్నారు. ఇవాళ్టితో వాళ్ల ఆందోళన 50వ రోజుకు చేరుకున్నది. ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోవడం లేదన్న ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. వందల సంఖ్యలో అక్రెడిటెడ్ సోషల్ హెల్త్ యాక్టివిస్ట్(ఆశా) వర్కర్లు కేరళలో కొన్నాళ్లుగా పోరాటం చేస్తున్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకితను, సంఘీభావాన్ని ప్రకటించారు. కొందరు మహిళలు తమ జుత్తును కత్తిరించుకోగా, మరికొందరు ఏకంగా గుండు గీయించుకున్నారు. ఆ శిరోజాలతో సెక్రటేరియేట్ ముందు నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్రభుత్వం తమను విస్మరిస్తోందని, తమకు ఏమాత్రం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తోందని, రోజుకు కేవలం 232 రూపాయలతో ఎలా బ్రతకగలమని ఆశా వర్కర్లు ప్రశ్నించారు. ప్రభుత్వం తమను పట్టించుకోకుంటే, ఇక్కడే ప్రాణాలు వదిలేస్తామని ఆశా వర్కర్లు నినదించారు. భావోద్వేగం తామేమీ ఉద్యమం చేయడం లేదని, ఇది బలమైన సందేశమని పేర్కొన్నారు. ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. తిరువనంతపురంతో పాటు అలప్పుజా, అంగమలే ప్రాంతాల్లో కూడా ఆశా వర్కర్లు తమ నెత్తి కత్తిరించుకున్నారు.

# రాప్తాడులో రంజుగా రాజకీయం..!

**అనంతపురం,తెలంగాణ దిశ :** రాప్తాడు.. రాయలసీమలో అత్యంత సున్నితమైన నియోజకవర్గం. ఇక్కడ రాజకీయం ఎప్పుడూ హాట్ హాట్‌గా ఉంటుంది. పరిటాల ఫ్యామిలీ వర్సెస్ తోపుదుర్తి కుటుంబం ఇందు కు కారణం. తాజాగా రాప్తాడులో పలుచోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు అలర్ట్ అవ్వడంతో ఘర్షణలు జరగలేదు. రాప్తాడు రాజకీయం మళ్లీ వేడెక్కింది. టీడీపీ వర్సెస్ వైసీపీ ఫైట్ ఉద్రిక్తతకు దారితీసింది. వివిధ స్థానాలకు గురువారం జరిగిన మండలాధ్యక్షుల ఉప ఎన్నికలు ఉద్రిక్తతకు కారణమయ్యాయి. రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి ఎంపీపీ ఎన్నిక వాయిదా పడింది. ఆ తర్వాత జరిగిన పరిణామాలు ఘర్షణకు దారితీశాయి. రాప్తాడులో అసలు ఏం జరిగిందో ఇప్పుడు చూద్దాం.ఉమ్మడి అనం తపురం జిల్లాలో వివిధ స్థానాలకు మండలాధ్యక్షుల ఉప ఎన్నికలు జరిగాయి. రామగిరి, గాండ్లపెంట ఎంపీపీ ఎన్నిక వాయిదా పడింది..రామగిరి ఎంపీపీ ఎన్నిక వాయిదాపడడంతో మండలానికి చెందిన ఎంపీటీసీ సభ్యులు సుజాత,సాయిలీల, ఆది లక్ష్మి, భారతి, వెంకటలక్ష్మి, చిన్నకొండయ్యలను బైండోవర్ చేయ డంకోసం పోలీసులు పెనుకొండతహసీల్దార్ వద్దకు తీసుకొ చ్చారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్, రాప్తాడు మాజీఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి,జడ్పీ ఛైర్ పర్సన్ గిరిజ అక్కడికి వచ్చా రు.తమ పార్టీ ఎంపీటీసీ సభ్యులను బయటకు పంపాలని డిమాండ్ చేశారు.తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తన అను చరులతో కలసి తహసీల్దార్ కార్యాలయంలోకి వెళ్లేందుకు యత్నిం చారు. ఆయన్ను పోలీసులు అడ్డుకుని బయటకు పంపారు..అదే సమాయానికి తెలుగుదేశం పార్టీ నాయకులు అక్కడికి వచ్చారు. పరిటాల శ్రీరామ్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు.

పోటీగా వైసీపీ కార్యకర్తలు జగన్, ప్రకాష్ రెడ్డికి మద్దతుగా నినాదాలు చేశారు.పోటాపోటీ నినాదాలతో తహసీల్దార్ ఆఫీస్‌లో టెన్షన్ వాతావరణం నెలకొంది. పోలీసులు ఇరువర్గాలను కంట్రోల్ చేశారు. అయినా నినాదాలు ఆగలేదు..తెలుగుదేశం పార్టీ నాయకులకు ఇక్కడేం పని అని తోపుదుర్తి పోలీసులను ప్రశ్నించారు. టీడీపీ లీడర్ల నినాదాలపై ఆగ్రహించిన ప్రకాష్ రెడ్డి.. వారిపైకి దూసుకెళ్లారు.ఈ సమయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. వెంటనే పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు.

పోలీసుల చర్యలపై ఆగ్రహించిన ఉషశ్రీచరణ్, గిరిజ పార్టీ శ్రేణులతో కలసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. బైండోవర్ చేసిన తరువాత ఎంపీటీసీ సభ్యులను అధికా రులు బయటకు పంపారు. వారిలో ఐదుగురు ఎంపీటీసీలు వైసీపీ నాయకులతో వెళ్లారు. ఒకరు మాత్రం టీడీపీ నాయకులతో వెళ్లిపోయారు.తాజాగా పరిస్థితుల నేపథ్యంలో.. రాప్తాడు నియోజకవర్గంలో పోలీసులు అలర్ట్ అయ్యారు. రామగిరి మండలంలో ఎలాంటి గొడవలు జరగకుండా చర్యలు చేపట్టారు.

# రూపాయి.. బెంబేలు

## ఒక్కరోజే 36 పైసలు క్షీణత

## డాలర్‌తో పోల్చితే 87.31 వద్దకు



ముంబై, : రూపాయికి మరిన్ని చిల్లులుపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు భగ్గుమనడం, టారిఫ్ అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతుండటంతోపాటు విదేశీ పెట్టుబడిదారులు భారీగా నిధులను తరలించుకుపోతుండటంతో దేశీయ కరెన్సీ విలువ ఒకేరోజు 36 పైసలు పడిపోయింది. ఫారెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ వారం కనిష్ఠ స్థాయి 87.31కి జారుకున్నది. దేశీయ ఈక్విటీ మార్కెట్లు పతనం చెందడంతో కరెన్సీ మార్కెట్లో సెంటిమెంట్‌ను నిరాశపరిచిందని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. 87.24 వద్ద ప్రారంభమైన డాలర్-రూపీఎక్స్ఛేంజ్ రేటు ఇంట్రాడేలో 87.36 కనిష్ఠ స్థాయిని తాకింది. చివరకు 36 పైసలు నష్టపోయి 87.31 వద్ద స్థిరపడింది. గత నెల 25న రూపాయి ఒకేరోజు 47 పైసలు నష్టపోయిన విషయం తెలిసిందే. దీనితర్వాత ఈరోజు అత్యధికంగా పడిపోయింది. డాలర్‌తో పాటు మిగతా ఆరు కరెన్సీలు కూడా పతనం చెందాయి. గ్లోబల్ మార్కెట్లో బ్యారెల్ బ్రెంటాయిల్ స్వల్పంగా పెరిగి 70.56 డాలర్లు పలుకగా, సెన్సెక్స్ 217.41 పాయింట్లు కోల్పోయింది. దీంతో ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు(ఎఫ్ఐఐ)లు రూ.485.41 కోట్ల పెట్టుబడులను వెనక్కితీసుకున్నారు. మళ్లీ నష్టాల్లోకి మార్కెట్లు: దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. ప్రారంభంలో భారీగా లాభపడిన సూచీలకు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలతో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు. ఇండస్ట్రియల్స్, చమురు అండ్ గ్యాస్ రంగ షేర్లలో చివరి గంటలో భారీగా అమ్మకాలు చోటు చేసుకోవడం సూచీలు నష్టాల్లోకి జారుకోవడానికి ప్రధాన కారణం. వరుసగా ఎనిమిది సెషన్లుగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 217.41 పాయింట్లు పతనం చెంది 74,115.17 వద్ద స్థిరపడింది. ప్రారంభంలో 74,741 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకిన సూచీ ఇంట్రాడేలో 74,022.24 పాయింట్లకు పడిపోయింది. మరో సూచీ నిఫ్టీ సైతం 92.20 పాయింట్లు కోల్పోయి 22,460.30 వద్ద స్థిరపడింది. దీంతో మదుపరులు రూ.4 లక్షల కోట్లకు పైగా సంపదను కోల్పోయారు. బీఎస్ఈలో లిస్టైన సంస్థల మార్కెట్ విలువ రూ.4,43,269.25 కోట్లు కరిగిపోయి రూ.3,93, 85,818.73 కోట్లు(4.51 ట్రిలియన్ డాలర్లు)గా నమోదైంది.

# గాజాకు విద్యుత్ కట్

## ఇజ్రాయిల్ దుశ్చర్య

## ఉప్పునీటిని మంచినీటిగా మార్చే ప్లాంట్‌కు ఆగిన విద్యుత్

## పాలస్తీనా వాసులకు తాగునీటి కష్టాలు

గాజా : కతార్‌లో కాల్పుల విరమణ రెండో దశ ఒప్పందంపై చర్చలు జరగడానికి ముందుగా గాజాకు ఇజ్రాయిల్ విద్యుత్‌ను నిలిపివేసింది. హమాస్ ఈ చర్యను తీవ్రంగా ఖండించింది. సెంట్రల్, దక్షిణ గాజా ప్రాంతాల్లోని ప్రజలకు తాగు నీరు అందజేసే, కీలకమైన ఉప్పునీటిని మంచినీరుగా మార్చే ప్లాంట్‌కు విద్యుత్ సరఫరాను నిలిపివేయడాన్ని అమానవీయమైన చర్యగా హమాస్ పేర్కొంది. పాలస్తీనియన్లను బ్లాక్‌మెయిల్ చేసేందుకు ఇటువంటి చవకబారు, ఆమోదయోగ్యం కాని ఎత్తుగడలను ఉపయోగించడాన్ని ఖండించింది. పాలస్తీనియన్ల జాతిని నిర్మూలించే దురుద్దేశంతోనే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతోందని పాలస్తీనా అథారిటీ విమర్శించింది. గాజాలో మానవతా విపత్తును సృష్టించాలన్న కుట్రలో భాగంగానే ఈ చర్యలన్నీ అమలు చేస్తున్నారని పాలస్తీనా విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఐక్యరాజ్య సమితి ప్రత్యేక ప్రతినిధి కూడా తాజా పరిణామాలను ఖండించారు. ఇజ్రాయిల్ ఉద్దేశపూర్వకంగానే ఈ చర్యలకు పాల్పడుతోందని, నీరు, విద్యుత్‌లను వారికి అందకుండా చేయాలని చూస్తోందని హ్యూమన్ రైట్స్ వాచ్ విమర్శించింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని పునరుద్ధ రించే లక్ష్యంతో ఈజిప్ట్, కతార్, అమెరికా మధ్యవర్తులుగా దోహాలో చర్చలు ప్రారంభం కావాల్సి వున్నాయి. ఈ నేపథ్యంలో తాజా పరిణా మాలు చోటు చేసుకున్నాయి. గాజాకు వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాల్సిందిగా బ్రిటన్, ఇజ్రాయిల్‌ను కోరింది. తాజా వార్తల



పట్ల బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారని ఆయన తరపు అధికార ప్రతినిధి తెలిపారు. గాజా ప్రజలకు అవసరమైన నిత్యావసరాలు అందకుండా చేయడమనేది అంతర్జాతీయ మానవతా చట్టాలను తీవ్రంగా ఉల్లంఘించడమేనని చెప్పారు. పాలస్తీనా విద్యార్థి నేత అరెస్టు: విద్యార్థుల కార్యకలాపాల పట్ల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో పాలస్తీని విద్యార్థి నేత మహ్మద్ ఖలీల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అమెరికా హోమ్‌ల్యాండ్ భద్రతా విభాగానికి చెందిన ఏజెంట్లు పాలస్తీనా కార్యకర్త, కొలంబియా యూనివర్శిటీ మాజీ విద్యార్థి మహ్మద్ ఖలీల్‌ను శనివారం అరెస్టు చేశారు. న్యూయార్క్ నగరంలోని ఆయన నివాసంలోనే ఈ అరెస్టు జరిగింది.

కొలంబియా యూనివర్శిటీలో పాలస్తీనా సంఘీభావ ఉద్యమ కార్యకలాపాల్లో ఖలీల్ క్రియాశీలంగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసిఇ)లో ఖలీల్‌ను నిర్బంధంలో వుంచారు. అక్కడ నుండి బహుశా ఆయనను తరలించే అవకాశంవుంది. గర్భవతి అయినఆయన భార్య చూసేందుకు వెళ్లగా అక్కడ లేరని, ఆయన ఆచూకీ గురించి కూడా వివరాలు తెలియజేయలేదని ఆయన తరపు న్యాయవాది అమీ గ్రీర్ చెప్పారు.

# మారని మధ్యతరగతి స్థితిగతులు!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ఎక్కడ చూసినా ఉరుకులు- పరుగులు. కుటుంబ పోషణ కోసం పడరాని పాట్లు, ఆరోగ్య సంరక్షణ కోసం ఉదయాన్నే వ్యాయామా లు.. పిల్లల చదువుల కోసం తంటాలు పడుతూ, లక్షల్లో ఫీజులు కడుతూ, హైరానా పడుతూ, నిద్రలేని రాత్రులు గడుపుతూ,మానసిక రుగ్మ తలకు గురవుతున్న మధ్యతరగతి జీవుల ఆర్థిక స్థితిగతులు మారకుండా సాంకేతిక పరిజ్ఞానం పేరుతో ఏదో సాధించేశామని చెప్పుకోవడం అతిశయోక్తి మాత్రమే కాగలదు. విజ్ఞానం పెరిగినా ఆర్థిక బాధలు ఆయుష్షును మింగేస్తున్నాయి. మానవ విజ్ఞానం గగనాన్ని తాకింది. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచాన్ని దగ్గర చేసింది. అయినా ఎక్కడో ఏదో వెలి తి, అసంతృప్తి కనిపిస్తున్నాయి.

ఒకప్పటికీ, ఇప్పటికీ మానవ జీవితంలో ఎన్నో మా ర్పులు సంభవించాయి. మానవ జీవిత గమనంలోని మలుపులను, మార్పులను ఒక్కసారి అవలోకనం చేసుకోవడానికి చరిత్ర పుటలను వెనక్కి తిప్పి చూస్తే మనకే ఆశ్చర్యం కలుగక మానదు. మానవ పరిణామ క్రమం ఒక ఎత్తయితే, నాగరికత పెరిగిన తర్వాత మనిషి జీవన విధానంలో సంభవించిన పెను మార్పులు మరొక ఎత్తు. దీనికి కారణం మనిషి ఆలోచనలు, ఆ ఆలోచనలకు కార్యరూపమిచ్చి, ప్రయోగాత్మక పద్ధతిలో విశ్లేషించడం, అనుకున్న లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదల ప్రదర్శించడం. తాముఊహించిన విషయాలు, ఆలోచనలు నిజమా? కాదా? అనే అంశంపై ప్రయోగాల ద్వారా నిర్ధారణకు రావ డం విజ్ఞాన తృష్ణకు దారితీసింది. దీనినే క్లుప్తంగా సైన్స్ అని చెప్పవచ్చు. ప్రపంచ గమనాన్ని మార్చిన సైన్స్ ప్రజా జీవితాలను ఎంతో సౌకర్యవంతంగా మలచింది. ఈ ప్రపంచంలో ప్రతీ జీవికి తెలివితేటలున్నాయి. అయితే మానవజాతికు న్న మేధస్సు మిగిలిన జీవరాశులకు లేకపోవడం వల్ల సమస్త ప్రాణులను, సకల సృష్టిని శాసించగల స్థితికి మానవుడు చేరుకున్నాడు. మానవ సామర్థ్యానికి ఆసక్తి, పట్టుదల తోడు కావడం వల్ల ఏదైనా సాధించగల మహోన్నత స్థితిని సాధించాడు. పూర్వకాలంలో కొన్ని ప్రపంచ దేశాలు పలు రకాల మహమ్మారులకు తుడిచిపెట్టుకుపోయాయి. ఇలాంటి సం ఘటనలు వైద్యశాస్త్రం అభివృద్ధి చెందడానికి దోహదం చేసాయి. ఇటీవలి కాలంలో కోవిడ్ మహమ్మారికి ప్రపంచం సుమారు రెండు సంవత్సరాలు స్తంభించిపోయింది. మానవ విజ్ఞానం వల్ల ఈ మహమ్మారికి త్వరితగతిన వ్యాక్సిన్ కనిపెట్టడం జరిగింది. ఈ విశాలమైన భూభాగంపై మానవాళి భాగస్వామ్యం ఒకశాతం మాత్రమే. భూతలంపై ఇంత స్వల్ప శాతం గల మానవుడు 99 శాతం జీవరాశులను శాసించ డం, కేవలం మానవ దయాదాక్షిణ్యాల మీద పలు జీవరాశుల మనుగడ ఆధారపడి ఉండడం పెరిగిన మానవాధి కృతకు పరాకాష్ఠగా చెప్పవచ్చు.మానవ విజ్ఞానం పెరగడం, టెక్నాలజీ శరవేగంగా మానవ జీవితాల్లో ప్రవేశించడం వల్ల అనేక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చిన మాట వాస్తవం. అనేక రంగాల్లో మానవ మేధ స్సు ప్రపంచ గమనాన్ని సమూలంగా మార్చడం జరిగింది.

## డంకీ మార్గంలో వెళుతూ మృత్యువాత

## గుజరాత్‌కు చెందిన వ్యక్తి మృతి

అహ్మదాబాద్,మార్చి11 : అక్రమంగా అమెరికాకు దొడ్డిమార్గంలో వెళ్తున్న భారతీయులను ఆ దేశం వెనక్కి పంపిస్తున్నప్పటికీ కొందరు దీనినే ఎంచుకుని ప్రమాదాల బారిన పడుతున్నారు. భారతీయులు అక్రమంగా ఇతర దేశాలకు వెళ్లడం మానుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచిస్తున్నప్పటికీ కొందరు ప్రమాదకరమైన డంకీ మార్గాల్లో అగ్రదేశానికి వెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు. ఈనేపథ్యంలోనే తాజాగా గుజరాత్‌కు చెందిన ఓ వ్యక్తి కుటుంబంతో సహా డంకీ రూట్ లో అమెరికాకు వెళ్తూ మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయిన ఘటన వెలుగు చూసింది. మృతుడిని గుజరాత్‌లోని సబర్‌కాంతా జిల్లాలోని మోయద్ గ్రామానికి చెందిన దిలీప్ పటేల్‌గా గుర్తించారు. దిలీప్ పటేల్ అమెరికాలో స్థిరపడాలనే ఆలోచనతో ఇటీవల ఓ ఏజెంట్‌ను సంప్రదించారు. తన భార్య, చిన్నారితో సహా ముగ్గురిని అమెరికా పంపడానికి రూ.కోటి చెల్లించాలని వారు కోరడంతో తమ భూమిని విక్రయించి.. వచ్చిన రూ.కోటి చెల్లించినట్లు స్థానికులు పేర్కొన్నారు. రెండు నెలల క్రితం అతడు కుటుంబంతో సహా టూరిస్ట్ వీసాపై దుబాయ్ వెళ్లి, అక్కడి నుంచి నికరాగ్వాకు వెళ్లాడు. అక్కడినుంచి డంకీ మార్గంలో ప్రయాణిస్తున్న సమయంలో మధుమేహ వ్యాధిగ్రస్తుడైన దిలీప్ అనారోగ్యానికి గురయ్యారు. ఆ సమయంలో అతడికి మందులు లభించకపోవడంతో అనారోగ్యం తీవ్రమై కోమాలోకి జారుకొని మృతి చెందాడని అధికారులు పేర్కొన్నారు. కాగా మృతుడి భార్యాబిడ్డలు అక్కడే చిక్కుకుపోయినట్లు తెలిపారు. ఈ సంఘటనపై తమకు ఎటువంటి సమాచారం అందలేదని స్థానిక పోలీసులు వెల్లడించారు. మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి విదేశాంగ శాఖ సహాయం తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అక్రమ వలసదారులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదటినుంచి కఠినంగా ఉంటున్నారు. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టడంతో వారిగుర్తింపు, తరలింపు ప్రక్రియను వేగవంతం చేశారు. ఈక్రమంలోనే ఇటీవల 104 మంది భారతీయులను సైనిక విమానంలో వెనక్కి పంపించిన సంగతి తెలిసిందే.

## తండ్రా బాటలోనే మెచ్యూర్డ్..

## రాటు దేలుతున్న లోకేష్

గుంటూరు: నారా లోకేశ్.. తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో పరిచయం అక్కరలేని నేత. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయకుడు వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చాడు. అయితే ఇంగ్లిష్ మీడియం చదువులు, రాజకీయ అనుభం లేకపోవడంతో మొన్నటి వరకు ఇబ్బంది పడ్డారు. కానీ, ఇప్పుడు బాగా రాటుదేలుతున్నారు. మెచ్యూర్డ్ రాజకీయాలు చేస్తున్నారు. టీపీపీ అధినేత నారా చంద్రబాబు నాయకుడు రాజకీయ వారసుడు నారా లోకేశ్ తండ్రి విజనరీ. భవిష్యత్‌ను అంచనా వేసి పనులు చేయగల నేర్పరి. అయితే ఆయన వారసుడిగా వచ్చిన లోకేష్ తండ్రి వ్యూహాలను అందుకోగలరా అన్న డౌట్లు చాలా మందిలో ఉన్నాయి. టీడీపీలోనూ ఈ విషయంలో అనుమానాలు ఉన్నాయి. అయితే.. అందతా గతం అంటున్నారు లోకేశ్‌ను దగ్గరి నుంచి గమనిస్తున్నవారు. లోకేశ్ ఇప్పుడు బాగా రాటుదేలుతున్నారు. గడిచిన ఐదేళ్లు విపక్షంలో ఉన్న సమయంలో లోకేష్ తనలోని నాయకత్వ ప్రతిభకు పదును పెట్టారు. యువగళం పేరుతో ఆయన చేపట్టిన పాదయాత్ర లోకేశ్‌తోపాటు పార్టీకి మంచి మైలేజీ తెచ్చింది. ఇప్పుడు టీడీపీ వ్యవహారాలను మొత్తం తానే చూసుకుంటున్నాడు. అదే సమయంలో మిత్రపక్షం జనసేనతో బంధం మరింత బలోపతం చేస్తున్నారు. జన సేనాని పవన్ కళ్యాణ్‌ను పవనన్న అని పిలుస్తూ మెచ్యూర్డ్‌గా పాలిటిక్స్ చేస్తున్నారు. ఏ చిన్న అవకాశం వచ్చినా వదలకుండా పవన్‌ను కలుపుకుపోతున్నారు. ఇటీవల పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి మాజీ సీఎం జగన్ కార్పొరేటర్‌కు ఎక్కువ.. ఎమ్మెల్యేకు తక్కువ అని సెటైర్లు వేశారు. దానిపైనా లోకేశ్ రియాక్ట్ అయ్యారు. పవన్ జోలికి వస్తే కబడ్దార్ అని వైసీపీ అధినేతకు మాస్ వార్నింగ్ ఇచ్చారు. పవన్ సత్తా ఏమిటో ఆయన స్థాయి ఏమిటో లోకేశ్ వివరించిన తీరు జనసైనికులను సైతం ఆకట్టుకుంది.

# ఆఫ్రికా ఐలాండ్ లో లలిత్ మోడీ?

ముంబై,: లలిత్ మోడీ విభిన్నమైన వ్యక్తి. వ్యాపార కిటుకులు తెలిసిన వ్యక్తి. పైగా క్రికెట్ కు కార్పొరేట్ రంగులు అద్దిన వ్యక్తి. అందువల్లే ఐపిఎల్ అనేది ఏర్పడింది. ఇంతలా అభివృద్ధి చెందింది. మంచి వెనుక చెడు ఉన్నట్టు.. ఐపీఎల్ ను మానస పుత్రిక లాగా అభివర్ణించుకున్న లలిత్ మోడీ.. ఆ తర్వాత దారి తప్పాడు. ఆర్థికంగా అవకతవకలకు పాల్పడ్డాడు. ఫలితంగా ఆర్థిక నేరగాడిగా ముద్రపడ్డాడు. చివరికి దేశం విడిచి వెళ్లిపోయాడు. ప్రస్తుతం విదేశాలలో తల దాచుకుంటున్నాడు. అతడిని ఇండియాకి తీసుకురావడానికి ఎన్ని రకాలుగా ప్రయత్నాలు చేసినప్పటికీ.. విఫలమవుతూనే ఉన్నాయి.. లలిత్ మోడీ కొన్ని సంవత్సరాలుగా ఇంగ్లాండ్ లో ఉంటున్నాడు. ఆ మధ్య అతడు సుస్మితాసేన్ తో కలిసి ఉంటున్నట్టు ప్రచారం జరిగింది. దానికి సంబంధించిన ఫోటోలను కూడా లలిత్ తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేశాడు.చాలా సంవత్సరాలుగా ఇంగ్లాండ్ లో ఉంటున్న లలిత్.. తనను ఎప్పుడైనా సరే భారత ప్రభుత్వం స్వదేశానికి తీసుకెళ్లి ఇబ్బంది పడుతుందని భావించి.. ఇంగ్లాండ్ నుంచి కూడా లలిత్ వెళ్లిపోయాడు. ఏకంగా "వనువాటు" అనే దేశం పౌరసత్వం తీసుకున్నాడు. వనువాటు అనేది 80 ద్వీపాల సమూహం. ఇది పసిఫిక్ మహాసముద్రంలో ఉంటుంది. ఇక్కడ ఆదాయపు పన్ను.. ఇతర టాక్స్ లు ఉండవు. ఈ ప్రాంతం క్రిప్టో కరెన్సీకి స్వర్గధామం గా ఉంది.

2024 లో హ్యాపీ ప్లానెట్ ఇండెక్స్ లో ఈ దేశం తొలి స్థానంలో ఉంది. మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న లలిత్.. స్వదేశంలో దర్యాప్తును తప్పించుకోవడానికి వను వాటు వెళ్లినట్టు తెలుస్తోంది.. లలిత్ మొదట్లో ఐపిఎల్ వ్యవహారాలను సక్రమంగానే నిర్వహించి



నప్పటికీ.. ఆ తర్వాత దారి తప్పాడు. ఆర్థికంగా అవకతవకలకు పాల్పడ్డాడు. చివరికి దేశం విడిచిపెట్టి వెళ్లిపోయాడు.

కొద్దిరోజులుగా ఇంగ్లాండ్లో తల దాచుకున్నాడు. ఇప్పుడు ఏకంగా వనువాటు వెళ్లిపోయాడు. అయితే ఆ దేశం పౌరసత్వం తీసుకోవడానికి లలిత్ ఎంత స్థాయిలో నగదు చెల్లించాడు అనేది బయటికి తెలియ రాలేదు. లలిత్ మోడీ ఐపీఎల్ ను అభివృద్ధి చేసింది నిజమే అయినప్పటికీ.. ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డాడని అతనిపై అభియోగాలు ఉన్నాయి. 2010 నుంచి అతడు ఇంగ్లాండ్ లో తల దాచుకుంటున్నాడు. అయితే ఇప్పుడు అతడు వేరే దేశం పౌరసత్వం తీసుకున్నాడు. దీంతో అతడు భారతదేశానికి వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. ఎందుకంటే అతడు పౌరసత్వం తీసుకున్న దేశంలో ఉన్న నిబంధనలే దానికి కారణమని తెలుస్తోంది.

# ప్రజారోగ్యానికి ముప్పు




రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో నెలకొల్పుతున్న వైద్య కళాశాలలకు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) నమూనాను వర్తింపజేసే టిడిపి కూటమి ప్రభుత్వ నిర్ణయం ఇప్పటికే మిణుకు మిణుకుమంటున్న ప్రజారోగ్యాన్ని మరింత చీకటిమయం చేస్తుంది. వైద్య విద్యను మరింతగా ప్రైవేటీకరిస్తుంది. ప్రభుత్వ ప్రతిపాదిత 'పిపిపి' మోడల్ ప్రైవేటు, కార్పొరేట్ల లాభాలకు బాగా ఉపయోగపడుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో మూడు సంవత్సరాల్లో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేయాలని గత వైసిపి ప్రభుత్వం తలచింది. కొత్తగా నెలకొల్పబోయే కాలేజీల్లో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టగా, అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న టిడిపి తీవ్రంగా వ్యతిరేకించింది. తాము అధికారంలోకొస్తే సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని రద్దు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చింది. ప్రజలు నిజమే కాదా అని నమ్మారు. అధికారంలోకొచ్చాక పి-3 అనడం ప్రజలకు ఇచ్చిన హామీని తుంగలో తొక్కడమే. ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయడమే. సెల్ఫ్‌ఫైనాన్స్ అని వైసిపి సర్కారు వైద్య విద్యార్థుల భవిష్యత్తును పెనం మీదికి నెట్టగా కూటమి ప్రభుత్వం ఏకంగా పొయ్యిలోకి తోసినట్లయింది.

రాష్ట్ర విభజన తర్వాత వైద్య విద్యలోకానీ, వైద్య మౌలిక సదుపాయాల్లోకానీ ఎ.పి. పరిస్థితి తెలంగాణతో పోల్చితే వెనకబాటులో ఉంది. విభజనతో నష్టపోయిన రాష్ట్రంలో ప్రజలకు నాణ్యమైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావాలంటే ప్రభుత్వ రంగంలో వైద్య విద్య, సౌకర్యాలు పెరగాలి. నవ్యాంధ్రలో పాలన చేసిన వైసిపి, టిడిపి ఆలోచన ఆ దిశలో లేదు. రాష్ట్రంలో ఆరు వేల వరకు ఎంబిబిఎస్ సీట్లుండగా సగం ప్రైవేటులోనివే. మొత్తం 36 మెడికల్ కాలేజీలు ఉండగా సగం ప్రైవేటువే. స్థానికంగా ప్రైవేటు మెడికల్ కాలేజీలో చదవాలంటే లక్షలు కుమ్మరించాలి. ఫీజులపై ప్రభుత్వ నియంత్రణ శూన్యం. రాజకీయ నాయకులు, పలుకుబడి కలిగిన మోతుబరుల చేతుల్లో ప్రైవేటు మెడికల్ కాలేజీలున్న నేపథ్యంలో ఫీజులపై ప్రభుత్వ నియంత్రణ ఆశించడం శుద్ధ దండగ. అన్నేసి లక్షలతో ప్రైవేటు కాలేజీల్లో సీట్లు కొనలేక వైద్య విద్యపై ఆసక్తి ఉన్న ఔత్సాహిక యువత తమ ఆలోచనను విరమించుకుంటున్నారు. మరికొంత మంది తక్కువ ఖర్చులో మెడిసన్ చేసేందుకు చైనా, ఫిలిప్పైన్స్, ఉక్రెయిన్ తదితర దేశాలకు వలస పోతున్నారు. ఈ పరిస్థితుల్లో కొత్తగా మెడికల్ కాలేజీలు ప్రభుత్వ రంగంలో నెలకొల్పుతారని విద్యార్థులు ఎంతో ఆశ పడ్డారు. పి-3 మోడల్ అని ప్రభుత్వం వారి ఆశలను అడియాశలు చేసింది.

కూటమి సర్కార్ ప్రకటించిన 'స్వర్ణాంధ్ర విజన్ 2047' నినాదం ఐశ్వర్య, ఆరోగ్య, ఆనంద రాష్ట్రాన్ని నిర్మించడం. ప్రజలందరూ ఆరోగ్యవంతులు కావాలంటే ఆ రంగానికి బడ్జెట్‌లో అందుకు తగిన విధంగా నిధులు కేటాయించాలి. జిడిపిలో కనీసం 2.5 శాతం ప్రజారోగ్యానికి ప్రభుత్వాలు ఖర్చు చేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. ఆరోగ్యాంధ్ర చేస్తామంటున్న కూటమి సర్కారు తన బడ్జెట్‌లో ఆరు శాతం ఇవ్వడం కనాకష్టమైపోయింది. చివరికి ఎంత ఖర్చు చేస్తారో తెలీదు. ఆస్పత్రుల్లో మందుల్లేవని అధికార సభ్యులే అసెంబ్లీలో గోల చేశారు. 108, 104 సేవలు, ఎన్‌టిఆర్ ఆరోగ్యసేవ అరకొరే. డాక్టర్లు, సిబ్బంది ఖాళీలు వేలాదిగా ఉన్నాయని స్వయాన మంత్రి శాసనసభకు సెలవిచ్చారు. డాక్టర్ పోస్టులకు ఎన్నిసార్లు నోటిఫికేషన్లు ఇచ్చినా రాకపోవడానికి కారణం లక్షలు పోసి ప్రైవేటు కాలేజీల్లో చదివిన వారికి సంపాదన, కెరీర్ పరమావధిగా దేశీయ కార్పొరేట్ ఆస్పత్రులు, విదేశాల బాట పట్టడమే. ప్రతి వెయ్యి మందికీ ఒక క్వాలిఫైడ్ డాక్టర్ ఉండాలని డబ్ల్యుహెచ్ఓ నిర్దేశించింది. తామొచ్చాక ఆ టార్గెట్‌ను దాటేశామంటోంది మోడీ ప్రభుత్వం. నగరాలు, పట్టణాల్లోఆనిష్పత్తిలో వైద్యులుండవచ్చునేమో కానీ గ్రామీణ ప్రాంతాల్లో, గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు చాలా చాలా అధమ స్థాయిలో ఉన్నాయనడానికి ఏజెన్సీలో తరచు కనిపించే డోలీ మోతలే నిదర్శనం. ఆరోగ్యం ప్రజల హక్కు. అది సాకారం కావాలంటే ప్రభుత్వ రంగంలో వైద్య సదుపాయాలు పరిపుష్టం కావాలి. ప్రభుత్వ రంగంలోనే వైద్య కాలేజీలు, ఆస్పత్రులు కొనసాగాలి. పి-3, పి-4 నమూనాలు మితిమీరిన చార్జీలు మోది ప్రజల మూలగ పీలుస్తాయి.

# నారి నారి నడుమ సరాగాలు...



హీరో శర్వానంద్ నటిస్తున్న రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటైర్టైనర్ 'నారి నారి నడుమ మురారి'. సంయుక్త మీనన్, సాక్షి విద్య కథానాయికలు. రామ్ అబ్బరాజు దర్శకుడు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మాతలు. సినిమా షూటింగ్ దాదాపు పూర్తికావచ్చింది. ఈ సందర్భంగా మేకర్స్ మ్యూజికల్ ప్రమోషన్స్ మొదలుపెట్ట నున్నారు. ఏప్రిల్ 7న 'దర్శనమే..' అంటూ సాగే ఈ సినిమాలోని తొలిపాటను విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన సాంగ్ పోస్టర్‌లో శర్వానంద్, సంయుక్త రొమాంటిక్ మోడ్‌లో బైక్ రైడ్‌ని ఆస్వాదిస్తూ కనిపిస్తున్నారు. ఈ చిత్రానికి కథ: భాను భోగవరపు, మాటలు: నందు సవిరిగాన, కెమెరా జ్ఞానశేఖర్ వి.ఎస్, యువరాజ్, సంగీతం: విశాల్ చంద్రశేఖర్, సహనిర్మాత: అజయ్ సుంకర, నిర్మాణం: ఏకె ఎంటైర్టైన్మెంట్స్, అడ్వంచర్స్ ఇంటర్నేషనల్ ప్రై.లిమిటెడ్.

# బేబీ బిజీ బిజీ..

'బేబీ'.. అనగానే ముందు గుర్తొచ్చే రూపం వైష్ణవి చైతన్య. ఆ ఒక్క సినిమాతో రెండు తెలుగురాష్ట్రాల యువతనీ తనవైపు తిప్పుకున్నది ఈ అచ్చతెలుగందం. దీపం ఉండగానే ఇల్లు చక్కబె ట్టుకునే తత్వం కాదు వైష్ణవి చైతన్యది. 'బేబీ' తర్వాత సినిమాలు క్యూ కట్టినా.. ఆచితూచి అడుగులు వేస్తూ.. నచ్చిన పాత్రలనే ఎంచుకుంటూ ఓ ప్లాన్ ప్రకారం ముందుకెళ్తున్నది ఈ అందాలభా మ. సిద్ధు జొన్నలగడ్డకు జోడీగా ఆమె నటించిన 'జాక్' సినిమా ఏప్రిల్ 10న విడుదల కానుంది. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఆమె ద్విపాత్రాభినం చేయస్తున్నట్టు సమాచారం. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒక హీరోయిన్‌కి ద్విపాత్రాభినయం చేసే అవకాశం రావడం అరుదే. ఆ అరుదైన ఛాన్స్‌ని వైష్ణవి కొట్టేసింది. ఈ సినిమా తర్వాత సూపర్‌హిట్ వెబ్‌సిరీస్ '90 ఏ మిడిల్‌క్లాస్ బయోపిక్' సీక్వెల్‌గా రూపొందుతున్న సినిమాలో ఆనంద్ దేవరకొండకు జోడీగా వైష్ణవి నటించనున్నది. సితార ఎంటైర్టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఇలా బడా సంస్థలు నిర్మిస్తున్న చిత్రాల్లో హీరోయిన్‌గా నటిస్తూ బిజీబిజీగా ఉన్నది వైష్ణవి చైతన్య. తాజాగా ఈ తెలుగమ్మాయి



ఓ ఫొటోషూట్‌లో పాల్గొన్నది. దీనికి సంబంధించిన కొన్ని ఫొటోలను సోషల్‌మీడియాలో షేర్ కూడా చేసింది. ఈ ఫొటోల్లో యువరాణిలా మెరిసిపోతున్న వైష్ణవి చైతన్యను చూడొచ్చు.

# రీఎంట్రీ బాలయ్య సినిమాతోనే?



ఎన్టీఆర్ బయోపిక్స్ కథానాయకుడు, మహానాయకుడు సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు చేరవయ్యారు బాలీవుడ్ నటి విద్యాబాలన్. ఆ చిత్రాల్లో ఆమె ఎన్టీఆర్ సతీమణి బసవతారం పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మళ్లీ తెలుగు తెరపై విద్యాబాలన్ కనిపించలేదు. అయితే.. మళ్లీ ఆమె టాలీవుడ్‌లోకి రీఎంట్రీ ఇస్తున్నారనేది లేటెస్ట్ న్యూస్. అది కూడా బాలయ్య సినిమాతోనేనట. ప్రస్తుతం బ్లాక్‌బస్టర్ 'అఖండ' సీక్వెల్ 'అఖండ – తాండవం' షూటింగ్‌లో బాలయ్య బిజీగా ఉన్న విషయం తెలిసిందే. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రంలో విద్యాబాలన్ ఓ కీలక పాత్ర పోషించనున్నారట. ఇందులో కథ రీత్యా ఓ పవర్‌ఫుల్ పొలిటికల్ లీడర్ పాత్ర ఉందట. ఆ పాత్రకోసం విద్యాబాలన్‌ని బోయపాటి సంప్రదించారనీ, కథ, పాత్ర విన్న తర్వాత ఆమె చేయడానికి అంగీకరించారని సమాచారం. స్టార్‌హీరోయిన్ విద్యాబాలన్‌తో ఆ పాత్ర చేయిస్తున్నారంటే.. కచితంగా కథలో కీలకమైన పాత్రే అయ్యుంటుదని ప్రేక్షకులు భావిస్తున్నారు. ఇప్పటికే ఇందులో సంజయ్‌దత్ కీలక పాత్ర పోషిస్తున్నట్టు వార్తలొస్తున్నాయి. ఇప్పుడు విద్యాబాలన్ కూడా తోడవ్వడంతో.. 'అఖండ–తాండవం' చిత్రానికి బాలీవుడ్‌లోనూ క్రేజ్ ఏర్పడటం ఖాయం అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# నిరాశపర్చిన రష్మిక సికిందర్



ఈ మధ్య కాలంలో సల్మాన్ ఖాన్ మూవీకి ఇంత తక్కువ ఓపెనింగ్స్ రావడం ఇదే అని ట్రేడ్ వర్గాలు చెబుతున్నారు. సల్లూభాయ్ గత చిత్రాలు "బజరంగీ భాయీ జాన్, కిక్, దబాంగ్, టైగర్ జిందా హై, సుల్తాన్, భరత్, ప్రేమ్ రతన్ ధన్ పాయో, ఏక్ థా టైగర్, టైగర్ – 3" చిత్రాలకు ఇంతకంటే మంచి ఓపెనింగ్స్ వచ్చాయంటున్నారు. సల్మాన్ తోటి హీరోలు చాలామంది ఇప్పటికే రూ. 500 కోట్ల క్లబ్ లో చేరితే సల్మాన్ మాత్రం ఆ విషయంలో వెనకబడి పోయారంటున్నారు. షారుఖ్ ఖాన్ 'పఠాన్, జవాన్' చిత్రాలతోనూ, రణబీర్ కపూర్ 'యానిమల్'తోనూ, సన్నీ డియోల్ 'గద్దర్ –2'తో, విక్కీ కౌశల్ 'ఛావా' చిత్రంతో రూ. 500 కోట్ల మైలురాయిని దాటేశారు. చివరకు గత యేడాది వచ్చిన హారర్ మూవీ 'స్త్రీ –2' సైతం రూ. 500 కోట్ల కబ్ లో చేరిపోయింది. కానీ సల్మాన్ ఇంకా ఆ మ్యాజిక్ ఫిగర్ ను అందుకోలేకపోతున్నారు. విశేషం ఏమంటే రశ్మిక మందణ్ణ ఇప్పటికే ఆ మైలురాయిని మూడు చిత్రాలతో దాటేసింది. ఆమె నటించిన 'యానిమల్, పుష్ప –2, ఛావా' లు రూ. 500 కోట్ల కబ్ల్ లో చోటు సంపాదించుకున్నా యి. కానీ ఇప్పుడీ 'సికందర్' మాత్రం రూ. 500 కోట్ల గ్రాస్ ను దాటడం కష్టమనే అంటున్నారు. ఆదివారంతో పోల్చితే... సోమవారం ఈద్ పండగ సెలవు కాబట్టి కొంత కలెక్షన్స్ పెరిగే ఛాన్స్ లేకపోలేదు. అయితే పులి మీద పుట్రలా ఇప్పటికే ఈ సినిమా ఆన్ లైన్ లో పైరసీ అయి చక్కర్లు కొడుతోందని బాలీవుడ్ వర్గాలు మొత్తుకుంటున్నాయిస్టార్ హీరోయిన్ రశ్మిక మందన్నా కెరీర్ అప్రతిహతంగా సాగిపోతోంది. వరుస విజయాలతో ముందుకు పోతున్న రశ్మికకు ఆ మధ్య వచ్చిన 'గుడ్ బై', 'మిషన్ మజ్ను' వంటి సినిమాలు నిరాశకు గురి చేశాయి. అయితే.. 2023 చివరిలో వచ్చిన రణబీర్ కపూర్ 'యానిమల్'తో మళ్ళీ ఒక్కసారిగా రశ్మిక మందణ్ణ కెరీర్ ఊపందుకుంది. ఆతర్వాత యేడాది 2024 డిసెంబర్‌లో వచ్చిన 'పుష్ప-2' ఆ యేడాది అత్యధిక కలెక్షన్స్ వసూలు చేసిన మూవీగా బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుంది. ఇక ఈ యేడాది ఫిబ్రవరిలో వచ్చిన 'ఛావా' సినిమా జాతీయ స్థాయిలో రశ్మిక మందణ్ణకు ప్రేక్షకులు నీరాజనాలు పట్టేలా చేసింది. ఆ రకంగా రశ్మిక హ్యాట్రిక్ ను సాధించింది. సల్మాన్‌ఖాన్ మూవీ 'సికందర్' ఆమెను తీవ్ర నిరాశకు గురి చేసింది.

# ఏ వైపు మంచిది?



చక్కటి ఆరోగ్యానికి చిక్కటి నిద్ర ఎంతో అవసరం. లేకుంటే.. అనారోగ్యాల పాలవ్వడం ఖాయం! ఈ విషయంలో నిద్ర ఒక్కటే కాదు.. నిద్రపోయే భంగిమ కూడా ఎంతో కీలకం. అందులోనూ ఎడమవైపు తిరిగి పడుకుంటే.. ఎంతో ప్రయోజనకరం.

రకరకాల మనుషులు.. రకరకాలుగా నిద్రిస్తుంటారు. కొందరు వెల్లకిలా పడుకుంటే.. మరికొందరు బోర్లా పడుకుంటారు. కొందరు కుడివైపు వాలితే.. ఇంకొందరు ఎడమవైపునకు ఒరుగుతుంటారు. వీటన్నిట్లోకి.. ఎడమవైపు తిరిగి పడుకోవడమే ఆరోగ్యానికి ఎంతో మేలని అంటున్నారు నిపుణులు.

ఇలా పడుకోవడం వల్ల భవిష్యత్తులోనూ ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయని చెబుతున్నారు. ఎడమవైపు తిరిగి పడుకోవడం గుండెకు ఎంతో మేలుచేస్తుంది. గుండె ఎడమ వైపునే ఉంటుంది కాబట్టి, అదే దిశలో పడుకుంటే గురుత్వాకర్షణ వల్ల ఎలాంటి ఇబ్బందుల్లేకుండా గుండెకు రక్త సరఫరా అవుతుంది. ఫలితంగా గుండెపై ఒత్తిడి తగ్గిపోతుంది.

గురక సమస్య తగ్గాలంటే.. ఎడమవైపు తిరిగి పడుకోండి. శ్వాస తీసుకోవడం కూడా సులభం అవుతుంది. ఎడమవైపు తిరిగి పడుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యం మెరుగుపడుతుంది. తిన్న ఆహారం జీర్ణం కాగా, మిగిలిన వ్యర్థాలు, టాక్సిన్లన్నీ పేగుల్లోనే ఉండిపోతాయి. కుడివైపు కన్నా ఎడమవైపు తిరిగి పడుకున్నప్పుడే.. అవన్నీ సులభంగా కిందికి వెళ్లిపోతాయి.

ఇక ఎడమ వైపు తిరిగి పడుకోవడం వల్ల.. వీపు, నడుము, వెన్నెముకపై ఒత్తిడి తగ్గుతుంది. మంచి నిద్ర పడుతుంది. ముఖ్యంగా.. గర్భిణులు ఇలా పడుకోవడం వల్ల పిండానికి రక్త ప్రసరణ మెరుగవుతుంది. ఆరోగ్యానికి ఎంత మంచిదైనా..

ఎప్పుడూ ఒకే వైపు తిరిగి పడుకోలేం. అందుకే కాసేపు కుడివైపు, వెల్లకిలా పడుకున్నా.. వీలైనంత ఎక్కువ సమయం ఎడమ వైపు తిరిగి పడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# అరిగిన కీళ్లకు కణాలతో వైద్యం



మోకాళ్ల నొప్పులు వృద్ధాప్య సమస్యల్లో ఒకటిగా చెప్పుకొనేవారు. అదంతా ఒకప్పుడు. ఇప్పుడు నలభై ఏళ్లకే మోకాళ్లే కాదు ఇతర కీళ్లలోనూ నొప్పులతో తిప్పలు పడుతున్న వారి సంఖ్య పెరుగుతున్నది. ఈ సమస్యకు సకాలంలో చికిత్స చేయకపోతే శస్త్ర చికిత్స చేయాల్సిందే. ప్రారంభంలోనే పీఆర్‌పీ థెరపీతో కీళ్ల నొప్పులకు చెక్ పెట్టొచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ కీళ్ల నొప్పులకు కారణాలు ఏమిటి? నొప్పికి ముందే వాటిని ఎలా గుర్తించాలి? ఆపరేషన్ లేకుండానే పీఆర్‌పీ థెరపీతో ఎలా నివారించవచ్చో నేటి ఊపిరిలో తెలుసుకుందాం. కీళ్ల నొప్పులు వయసుతో సంబంధం ఉన్న వ్యాధుల్లో ఒకటిగా వైద్యులు గుర్తించారు. జీవనశైలిలో, ఆహారపు అలవాట్లలో మార్పులతో కీళ్ల నొప్పులకూ వయోసడలింపు వచ్చేసింది. అరవైకి ఇరవై ఏళ్ల ముందే మోకాళ్ల నొప్పులు బాధిస్తున్న వారు నానాటికీ పెరుగుతున్నారు. మోకీళ్లే కాదు భుజం నొప్పి, వెన్నునొప్పి, తుంటి నొప్పి ఇలా శరీరంలోని కీళ్ల నొప్పులతో బాధపడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. కీళ్ల నొప్పులకు జీవనశైలి, ఆహారమే కాదు నిర్లక్ష్యమూ ఓ కారణమే.

మోకాలి నొప్పులు: కొందరిలో మోకాలి కీలులోని కార్టిలేజ్ అరుగుతుంది. దీని వల్ల కీళ్లలోని ఎముకల మధ్య రాపిడి జరుగుతుంది. అప్పుడు కీలులో నొప్పి కలుగుతుంది. ఇన్‌ఫ్లమేషన్‌కు దారితీస్తుంది. ఈ నొప్పి వల్ల రోగి లేవడం, నడవడం కష్టంగా ఉంటుంది. వయసు రీత్యా వచ్చే ఈ సమస్యను ప్రారంభదశలోనే గుర్తించి, పీఆర్‌పీ థెరపీ చేస్తే.. సర్జరీ అవసరమే ఉండదు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే, రోగం ముదిరిన తర్వాత చికిత్స చేయాలంటే శస్త్ర చికిత్స ద్వారా కీలు మార్పిడి చేయడమే పరిష్కారం.

భుజం నొప్పి: భుజాల్లోని టెండాన్ (ఎముకను అతుక్కుని ఉండే కం డరాల అంచు)కు పగుళ్లు రావడం వల్ల ఇన్‌ఫ్లమేషన్ ఏర్పడుతుంది. అంటే ఎముకను అతుక్కునే కండ రం చివరి భాగం దెబ్బతిని, ఎర్రగా మారుతుంది. అందువల్ల భుజంలో నొప్పి కలుగుతుంది. చేతిని అటూ, ఇటూ, పైకి, కిందికి కదిలించేటప్పుడు ఇబ్బందిగా ఉంటుంది. సమస్య తీవ్రంగా ఉంటే చేయి కదిలించడం కష్టం. చేతిని కదల్చలేని 'ఫ్రోజన్ షోల్డర్' అంటారు. ఈ సమస్యను సకాలంలో గుర్తిస్తే పీఆర్‌పీ థెరపీతో నివారిం చవచ్చు. నిర్లక్ష్యం చేస్తే సర్జరీ తప్పదు.

ఎవ్యాస్క్యులర్ నెక్రోసిస్ ఆఫ్ హిప్: కరోనా చికిత్సలో స్టెరాయిడ్స్ వినియోగించడం వల్ల ఈ సమస్యతో బాధపడే రోగుల సంఖ్య కోవిడ్ తర్వాత పెరిగింది.

స్టెరాయిడ్స్ వాడితే తుంటిలోని కీళ్లలో రక్త ప్రసరణ తగ్గుతుంది. తుంటిలోని ఎముక కుళ్లుతుంది. నొప్పి తీవ్రంగా బాధిస్తుంది. తుంటిని కదిలించలేరు. ఈ సమస్య చిన్న వయసులో వస్తే వారికి పీఆర్‌పీ చికిత్స ఉత్తమమైన పద్ధతి.

టెన్నిస్ ఎల్బో సమస్య: మోచేతిలోని ఒక చిన్న ఎముకతో ఐదు కండరాలు అనుసంధానమవుతాయి. ఈ కండరా లను 'కామన్ ఎక్స్‌టెన్షన్ టెండాన్'అంటారు. ఆట లు ఆడినప్పుడు, ఏదైనా దెబ్బ తగిలినప్పుడు ఆ కండరాలు ఎముకతో అనుసంధానమైన చోట పగుళ్లు ఏర్పడతాయి. అందువల్ల తీవ్రమైన నొప్పి కలుగుతుంది. ఆటలు ఆడలేరు. అలాంటి వారికి శస్త్ర చికిత్స అందుబాటులో లేదు. వారికి పీఆర్‌పీ థెరపీతో ఉపశమనం ఉంటుంది.


అరికాళ్లలో నొప్పి:అరికాళ్లలో నొప్పి (మడమ నొప్పి) ని 'ప్లాంటార్‌ఫేషి ఐటీస్' అంటారు. ఎక్కువగా నడవడం వల్ల, చెప్పులు లేకుండా పనిచేయడం వల్ల, గరుకు ప్రదేశాల్లో చెప్పులు లేకుండా నడవడ టం వల్ల మడమలో ప్లాంటర్ పొర తెగుతుంది. అప్పుడు మడమ (అరికా ళ్ల)లో తీవ్రమైన నొప్పి కలుగుతుంది. నడవడం కష్టమవుతుంది. ఈ సమస్యకు కూడా సర్జరీ లేదు. పీఆర్‌పీ థెరపీ చక్కటి పరిష్కారం.

ప్రారంభ దశలో..: కొంతమంది 30 నుంచి 40 ఏళ్ళ మధ్య వయసులో జాయింట్ పెయిన్స్ వస్తే.. అవగాహన లేక పట్టించుకోరు. ఉపశమనం కోసం ఆయింట్‌మెంట్లు రాసుకుంటారు. నూనెలతో మర్దనా చేసుకుంటారు.

కొంతమంది నొప్పుల మాత్రలు వాడతారు. ఇవి వాడటం వల్ల తాత్కాలిక ఉపశమనం కలుగుతు ంది. కొన్నిరోజుల తర్వాత సమస్య మళ్లీ మొదటికి వస్తుంది. ఇంకొందరు కొన్ని ప్రత్యేక వ్యాయామాల ద్వారా తగ్గించుకోవచ్చని ప్రయత్నాలు చేస్తుంటారు. వ్యాయామాలతో కీళ్ల నొప్పులు తగ్గకపోవడమే కాకుండా తీవ్రమవుతాయి.

అందుకని తరచూ నొప్పులు వచ్చినా లేక దీర్ఘకాలంగా నొప్పులు బాధిస్తున్నా వైద్యులను సంప్రదించాలి. ఎక్సరే లేదా స్కానింగ్ తీయించుకోవాలి. ఇబ్బందిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే పీఆర్‌పీ థెరపీతో ఆదిలోనే సమస్యకు అడ్డుకట్ట వేయవచ్చు. కీళ్ల సమస్యల లక్షణాలు: కీళ్లలో తీవ్రమైన నొప్పి రావడం, 15 రోజుల పాటులేదా తరచూ నొప్పి ఉంటే కీళ్లలో డ్యామేజ్ ఉందేమోనని అనుమానించాలి. కీళ్లను కదిలించలేకపోవడం, కీళ్లలో వాపు.

మణికట్టు, భుజం, చీలమండ, భుజంలో తీవ్రమైన నొప్పి పీఆర్‌పీ థెరపీ ఎలా చేస్తారు?: 'ప్లేట్‌లెట్స్ రిచ్ ప్లాస్మా' థెరపీని 'పీఆర్‌పీ థెరపీ' అంటారు. ఇది పాత చికిత్సా పద్ధతే! కొన్ని కారణాల వల్ల ఈ పద్ధతి ప్రాచుర్యంలో లేదు. ఐదారేళ్ల నుంచి ఈ చికిత్సా విధానానికి ఆదరణ పెరుగుతున్నది. ఈ థెరపీ గురించి అనేక పరిశోధనలు జరిగాయి. మెరుగైన ఫలితాలు గుర్తించడంతో దీనికి మళ్లీ డిమాండ్ పెరిగింది. ఈ పీఆర్‌పీ చికిత్సా పద్ధతిలో రోగి నుంచి 20 మిల్లీ లీటర్ల రక్తాన్ని సేకరిస్తారు. ఆ రక్తాన్ని ఒక టెస్ట్ ట్యూబ్‌లో నింపిన తర్వాత పీఆర్‌పీ సెంట్రిఫ్యూజ్ మెషిన్‌లో తిప్పుతారు. రక్తం నుంచి 'గ్రోత్ ఫ్యాక్టర్ సెల్స్' వేరవుతాయి. ఈ సెల్స్‌ను దెబ్బతిన్న కీలు



భాగంలోకి ఇంజెక్షన్ ద్వారా ఇస్తారు. కార్టిలేజ్ దెబ్బతిన్న భాగంలోకి గ్రోత్ ఫ్యాక్టర్ సెల్స్'ని పంపడం వల్ల ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది. కార్టిలేజ్ రీ మోడలింగ్ (పునరుత్పత్తి) జరుగుతుంది. ఈ విధంగా సమస్య తీవ్రతను బట్టి రెండు లేదా మూడు సార్లు పీఆర్‌పీ థెరపీ చేయాల్సిన అవసరం ఉంటుంది. థెరపీ అనంతరం మూడు నుంచి నాలుగు నెలలపాటు వైద్యుల పరిశీలన (ఫాలో అప్) అవసరం. థెరపీ అనంతరం కొన్ని జాగ్రత్తలు, ఆహార నియమాలు పాటించాలి. వైద్యులు సూచించిన వ్యాయామాలు చేయాలి. క్రీడల్లో గాయపడ్డ వారికి కూడా పీఆర్‌పీ థెరపీ మంచి ఫలితాలు ఇస్తుంది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215